# మనం
# మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

ఆదివారం | 18 | అక్టోబర్ | 2026 | పేజీలు 13 | www.manamepaper.com




### క్రీడల్లో
# గెలుపోటములు
# సహజం

## కీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి : మంత్రి వాకిటి శ్రీహరి

**క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించిన వనపర్తి ఛాంపియన్‌షిప్ కప్-2026 ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.**

వనపర్తి, అక్టోబర్ 18 (మనం ప్రతినిధి) జిల్లా కలెక్టర్‌కు ట్రోఫీ నిర్వహించాలని వచ్చిన వినూత్న ఆలోచన అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. విద్యార్థులు చిన్న సమస్యలకే కుంగిపోకుండా క్రీడల ద్వారా ఆత్మవిశ్వాసం పెంచుకోవాలన్నారు. యు-వతకు మానసిక స్థైర్యం కోసం క్రీడా

- మిగతా 2లో..

### ఆధార్ కార్డుల్లో రాష్ట్రం పేరు మార్పునకు
# 60 రోజులే గడువు

**ఆధార్ కార్డుల్లో రాష్ట్రం పేరును 'ఆంధ్రప్రదేశ్' నుంచి 'తెలంగాణ'గా సవరించేందుకు 60 రోజుల గడువు**

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**ఆధార్ కార్డుల చిరునామాలో రాష్ట్రం పేరును 'ఆంధ్రప్రదేశ్' నుంచి 'తెలంగాణ'గా సవరించేందుకు ప్రతిపాదిత ప్రక్రియ చేపట్టనున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సమన్వయంతో ఈ సవరణ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం మినహా మిగిలిన తొమ్మిది జిల్లాలకు చెందిన ప్రభావిత నివాసితుల ఆధార్ చిరునామాల్లో రాష్ట్రం పేరును సవరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా, ప్రజలకు పబ్లిక్ నోటీసు జారీ చేసిన తేదీ నుంచి 60 రోజుల పాటు స్వచ్ఛందంగా చిరునామా సవరణ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. కాబట్టి, సంబంధిత నివాసితులు తమ ఆధార్ కార్డుల్లోని చిరునామా వివరాలను పరిశీలించుకుని, రాష్ట్రం పేరు 'ఆంధ్రప్రదేశ్'గా ఉంటే నిర్దేశించిన గడువులోగా 'తెలంగాణ'గా సవరించుకోవాలని

- మిగతా 2లో..

### చిమనగుంటపల్లిలో
# పల్లీల పంచాయితి

## మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి పేరు చెప్పి దండుకున్న దళారులు

### ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ రోడ్డెక్కి రాస్తారోకో.. ధర్నా చేసిన మహిళలు

ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే వేరుశనగ విత్తనాలు అర్హులైన మహిళా రైతులకు దక్కకుండా దళారుల పాలు కావడంతో చిమనగుంటపల్లిలో మహిళలు రోడ్డెక్కిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామంలో రెండు మహిళా సంఘాల్లో 30 మంది మహిళా రైతులు ఉన్నారు.

2






# క్రీడల్లో గెలుపోటములు సహజం

మొదటి పేజీ తరువాయి

మైదానాలను అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే దసరాకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ తరహా ట్రోఫీలు నిర్వహిస్తామన్నారు. మన క్రీడాకారుల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించే సత్తా ఉందని, నిఖత్ జరీన్, మహమ్మద్ సిరాజ్ లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. డిసెంబర్ లో ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా 22 క్రీడాంశాల్లో 29 రాష్ట్రాల క్రీడాకారులతో పోటీలు మన రాష్ట్రంలో నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని, ఆట ఎవరి సొత్తు కాదని, నైపుణ్యం, క్రమశిక్షణ ఉన్నవారే విజయం సాధిస్తారని అన్నారు.



దేవి శరన్నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. నిన్న జోగులాంబ అమ్మవారి దర్శనం వల్ల ప్రారంభానికి రాలేకపోయానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతా రెడ్డి, క్రీడా ప్రాధికార చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. పోటీల్లో ఛాంపియన్ గా నిలిచిన వనపర్తి జట్టుకు ట్రోఫీ అందజేశారు.

# ఆధార్ కార్డుల్లో రాష్ట్రం పేరు మార్పునకు 60 రోజులే గడువ

మొదటి పేజీ తరువాయి

సూచించారు. 60 రోజుల గడువు ముగిసిన తర్వాత కూడా స్వచ్ఛందంగా సవరణ చేసుకోని వారి ఆధార్ చిరునామాల్లో రాష్ట్రం పేరును 'తెలంగాణ'గా యు ఐ డి ఏ ఐ స్వయంచాలకంగా సవరించే ప్రక్రియ చేపడుతుందని తెలిపారు. ఈ మార్పు రాష్ట్రం పేరు వరకు మాత్రమే పరిమితమవుతుందని వివరించారు. అలాగే, సంబంధిత ప్రాంతాల పిన్‌కోడ్‌ల వివరాల్లో ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు జిల్లా అధికారులు పరిశీలన చేపడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, తమ ఆధార్ చిరునామా వివరాలను ముందుగానే తనిఖీ చేసుకుని, అవసరమైన సవరణలు చేసుకునేందుకు 60 రోజుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# చిమనగుంటపల్లిలో పల్లీల పంచాయతి

వనపర్తి అక్టోబర్ 17 (మనం ప్రతినిధి) : రైతులను ప్రోత్సహించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా ఒక్కో మహిళా రైతుకు క్వింటాలున్నర వేరుశనగ విత్తనాలను ఉచితంగా అందజేయాలని నిర్ణయించింది. అయితే ఈ విషయాన్ని అధికారులు సక్రమంగా మహిళలకు చెప్పకుండా అవసరం ఉన్నవారు తీసుకోవచ్చు అంటూ మొక్కుబడిగా చెప్పడంతో డబ్బులు పెట్టి కొనాలేమో అనుకొని చాలామంది మహిళలు ముందుకు రాలేదు. ఈ అయోమయాన్నే ఆసరాగా చేసుకున్న కొందరు దళారులు మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి పేరు చెప్పి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో కుమ్మక్కై విత్తనాలను దొంగచాటుగా కొట్టేశారు. అసలు విషయం తెలిసి మహిళా రైతులు నిర్ఘాంతపోయారు. ప్రభుత్వం తమకు ఉచితంగా ఇస్తున్న విత్తనాలను దళారులు దండుకున్న తీరుపై ఆగ్రహంతో ఊగిపోయారు. గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలిని నిలదీయగా ఆమెకు కూడా ఉచితమన్న విషయం తెలియకపోవడంతో వాస్తవం బయటపడింది. దళారుల మోసాన్ని తెలుసుకున్న మహిళలు వెంటనే వనపర్తి - ఖిల్లా ఘణపురం రహదారిపైకి చేరుకొని నినాదాలు చేస్తూ రాస్తారోకో, ధర్నాకు దిగారు. ఆడబిడ్డల ఆగ్రహం, ఆవేదన చూసి గ్రామమంతా వారికి మద్దతుగా నిలిచింది. విషయం తెలుసుకున్న జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్ వనపర్తి రూరల్ ఎస్సై రిషికేష్ నేతృత్వంలో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకొని మహిళల ఆవేదనను విన్నారు. దళారుల నుంచి విత్తనాలను రికవరీ చేసి అర్హులైన మహిళా రైతులకే అందిస్తామని, ఇలాంటి దళారీ వ్యవస్థకు చెక్ పెడతామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు. పేద మహిళా రైతుల నోటికాడి విత్తనాలను కొట్టేసిన దళారుల తీరుపై గ్రామంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.




# పెద్ద సూరారంలో న్యాయ చైతన్య సదస్సు

నల్గొండ-అక్టోబర్ 17( మనం న్యూస్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు పెద్ద సూరారం గ్రామపంచాయతీ కార్యాలయంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. హిమబిందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని వివరించారు. పేదలు, ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, వృద్ధులు తదితర అర్హులైన వర్గాల ప్రజలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కుటుంబ సమస్యలు, ఆస్తి వివాదాలు, మహిళల హక్కులు, బాలల రక్షణ, కార్మికుల హక్కులు వంటి అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా సంబంధిత న్యాయ సేవా సంస్థలను సంప్రదించి తగిన సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి గుండె జానమ్మ, ఉపసర్పంచ్ పెండెం అరుణ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి టీ. అనిల్ కుమార్, మహేష్, గోవర్ధనం, యాదయ్య, రాములు పారా లీగల్ వాలంటరీ భీమనపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రుద్రవెల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## పేదల ఆత్మగౌరవానికి స్మార్ట్ రేషన్ కార్డులు : సర్పంచ్ సరళ అశోక్ రెడ్డి

బీబీనగర్, అక్టోబర్ 17 (మనం న్యూస్): మండలంలోని రుద్రవెల్లి గ్రామంలో శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ జిలకపల్లి సరళ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డులు పేద కుటుంబాలకు గుర్తింపుతో పాటు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు మంజూరు కాకపోవడం, కుటుంబ సభ్యుల పేర్ల నమోదులో ఇబ్బందులు ఎదురవడంతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు కృషి చేస్తోందన్నారు. భువనగిరి నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్లు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఉపసర్పంచ్, గ్రామ వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ




# పెద్ద సూరారంలో న్యాయ చైతన్య సదస్సు

నల్గొండ-అక్టోబర్ 17( మనం న్యూస్) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు పెద్ద సూరారం గ్రామపంచాయతీ కార్యాలయంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. హిమబిందు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పౌరుడు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని వివరించారు. పేదలు, ఆర్థికంగా వెనుకబడినవారు, మహిళలు, పిల్లలు, వృద్ధులు తదితర అర్హులైన వర్గాల ప్రజలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కుటుంబ సమస్యలు, ఆస్తి వివాదాలు, మహిళల హక్కులు, బాలల రక్షణ, కార్మికుల హక్కులు వంటి అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా సంబంధిత న్యాయ సేవా సంస్థలను సంప్రదించి తగిన సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి గుండె జానమ్మ, ఉపసర్పంచ్ పెండెం అరుణ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి టీ. అనిల్ కుమార్, మహేష్, గోవర్ధనం, యాదయ్య, రాములు పారా లీగల్ వాలంటరీ భీమనపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కోతుల స్వైరవిహారం.. వెల్టూర్‌లో వణుకుతున్న జనం!

**వృద్ధురాలిపై గుంపుగా దాడి.. కాలికి తీవ్ర గాయాలు**

**గడప దాటాలంటేనే జంకుతున్న గ్రామస్తులు**

**అటవీశాఖ అధికారులు స్పందించి తరలించాలని విజ్ఞప్తి**

ఉప్పునుంతల, అక్టోబర్ 17 (మనం న్యూస్) : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని వెల్టూర్ గ్రామంలో కోతుల బెడద తీవ్రరూపం దాల్చింది. రోజురోజుకూ గుంపులుగా చేరుతున్న కోతులు వీధుల్లో స్వైరవిహారం చేస్తూ గ్రామస్తులపై దాడులకు తెగబడుతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.



**వృద్ధురాలిపై మూకుమ్మడి దాడి**

శనివారం ఉదయం స్థానిక బస్టాండ్ సమీపంలో నివాసముంటున్న బూసిరాజ్ బాలమ్మ అనే వృద్ధురాలు ఇంటి నుంచి బయటకు రాగానే ఒక్కసారిగా నాలుగు, ఐదు కోతులు ఆమెపైకి దూకాయి. తప్పించుకునే అవకాశం లేకుండా చుట్టుముట్టి దాడి చేయడంతో ఆమె కాలికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు భయంతో కేకలు వేసినప్పటికీ ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో అతికష్టంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇంట్లోకి పరుగులు తీసింది.

**గడప దాటాలంటే భయం**

గ్రామంలో గత కొద్ది రోజులుగా వరుసగా కోతుల దాడులు జరుగుతున్నాయని, ఆ ఘటనలు మరవకముందే మరోసారి వృద్ధురాలిపై దాడి జరగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల పైకప్పులు, డాబాలు, వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ తలుపులు తీస్తే చాలు లోపలికి చొరబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కోతులు, మరోవైపు వీధి కుక్కల బెడద తోడవడంతో చిన్నపిల్లలు, పాఠశాల విద్యార్థులు ఒంటరిగా బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు.

**శాశ్వత పరిష్కారం చూపాలి**

గ్రామ పంచాయతీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఏదో ఒకరోజు వచ్చి తాత్కాలికంగా వాటిని తరిమినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. అటవీశాఖ అధికారుల సమన్వయంతో ప్రత్యేకంగా మంకీ క్యాచర్లను రప్పించి, గ్రామంలోని కోతులన్నింటినీ బంధించి సుదూర అటవీ ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. పాలకులు, సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వెల్టూర్ వాసులు కోరుతున్నారు.



# ఉప్పరిపల్లిలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

## సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు

ఉప్పునుంతల, అక్టోబర్ 17 (మనం న్యూస్) : ఉప్పునుంతల మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో కొలువైన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలో 'ఛత్రపతి శివాజీ యూత్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారు శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ (ఛత్రపతి శివాజీ యూత్) నిర్వాహకులు రాబోయే రోజుల కార్యక్రమ వివరాలను వెల్లడించారు: శనివారం: సాయంత్రం 4:00 గంటలకు మహిళల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా 'బోనాల సమర్పణ' కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఆదివారం: తెల్లవారుజామున సరిగ్గా 5:01 గంటలకు లోకకల్యాణార్థం పవిత్ర 'చండీ హోమం' ఘనంగా ప్రారంభమవుతుంది. సోమవారం: సాయంత్రం భక్తులందరికీ 'మహా అన్నప్రసాద వితరణ' ఏర్పాటు చేయబడుతుంది. మంగళవారం: సాయంత్రం అమ్మవారి చీరల 'వేలం పాట', అనంతరం భక్తులను అలరించేందుకు ప్రత్యేక సాంస్కృతిక 'ఆర్కెస్ట్రా' కార్యక్రమం ఉంటుంది. బుధవారం: ఉదయం పవిత్ర 'ఒడి బియ్యం' సమర్పణ, అనంతరం సాయంత్రం ఘనమైన 'శోభాయాత్ర'తో ఉత్సవాలు వైభవంగా ముగుస్తాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించి, కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

# సరస్వతీ అలంకారంలో అమ్మవారికి పూజలు



కొల్లాపూర్ 18 అక్టోబర్ (మనం న్యూస్) : కొల్లాపూర్ పట్టణంలోని శ్రీ శమీ వృక్ష కమిటీ ఆధ్వర్యం లో చాలామంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో చాలామంది మహిళలు అక్షరాభ్యాసం కోసం అమ్మవారి దర్శనం చేసుకోవడమైనది ఇట్టి కార్యక్రమంలో శమీ వృక్ష కమిటీ సభ్యులు భక్తాదులు పాల్గొని పురోహితులు దిలీప్ శర్మ ఆశీర్వాదం తీర్థ ప్రసాదములు స్వీకరించడం జరిగినది.

# కొల్లాపూర్ చౌరస్తాలో ఆర్టీఏ సేవలు ప్రారంభం

**నూతన కార్యాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**డీటీఓ ఇమ్రాన్ అహ్మద్**

నాగర్ కర్నూల్, మనం న్యూస్ అక్టోబర్ 17) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద, కలెక్టరేట్ సమీపంలో నూతనంగా నిర్మించిన జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఏ సేవలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ అహ్మద్ తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి చేతుల మీదుగా ఇటీవల ప్రారంభమైన ఈ నూతన కార్యాలయం నుంచి ప్రజలకు సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు రవాణా సేవలను మరింత చేరువ చేయడం, వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రధాన ప్రాంతంలో ఉండటం వల్ల జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు కార్యాలయాన్ని చేరుకోవడం సులభమవుతుందని తెలిపారు. వాహనదారులు తమ వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు తదితర రవాణా శాఖ పనుల కోసం అవసరమైన పత్రాలతో నూతన కార్యాలయాన్ని సంప్రదించాలని, ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీటీఓ ఇమ్రాన్ అహ్మద్ కోరారు.



# పంచాయతీ సిబ్బందికి ఏకరూప దుస్తుల పంపిణీ

**విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలి : సర్పంచ్ శ్రీలత విజేందర్ రెడ్డి**



ఉప్పునుంతల, అక్టోబర్ 17(మనం న్యూస్) : గ్రామ పరిశుభ్రత, అభివృద్ధిలో పంచాయతీ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని, వారు నిరంతరం అంకితభావం తో పనిచేసి గ్రామ పురోగతికి తోడ్పడాలని పెనిమెళ్ల గ్రామ సర్పంచ్ మేడసాని శ్రీలత విజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెనిమెళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందికి ఏకరూప దుస్తులు (యూనిఫామ్స్), మహిళా సిబ్బందికి చీరలను ఆమె స్వహస్తాలతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతిరోజూ పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమై గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికుల శ్రమ ఎనలేనిదని కొనియాడారు. వారి సంక్షేమం, గుర్తింపును దృష్టిలో ఉంచుకుని పంచాయతీ తరపున ఈ ఏకరూప దుస్తులను అందజేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో సిబ్బంది అందరూ సమష్టిగా వ్యవహరిస్తూ, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కేతావత్ జైపాల్, గ్రామ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలి

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి అక్టోబర్ 18 (మనం ప్రతినిధి) : నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలంటూ చేస్తున్న ధర్నా శిబిరాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం చట్టపరిధిలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ మాట ఇచ్చిన ప్రకారం మొత్తం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు క్యాబినెట్ ఆమోదంతో జీవో తీసుకొస్తే ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులు కుట్రపూరితంగా నిరుద్యోగులతో కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ సమాన పనికి సమాన వేతనం పేరిట ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు గౌరవ వేతనం పెంచి వారి ఆత్మగౌరవాన్ని కాపాడారని అన్నారు. తాను గతంలో న్యాయవాదిగా కాంట్రాక్ట్ ఉద్యోగుల హక్కుల కోసం పోరాడానని, తన పోరాటంతోనే సమాన పనికి సమాన వేతనం వచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు రాష్ట్రాలకు వర్తిస్తాయని, న్యాయ పోరాటం ద్వారా మీకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే సాధ్యాసాధ్యాలను పరిశీలించి చట్టపరిధిలో రెగ్యులర్ చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మీ డిమాండ్లలోని న్యాయబద్ధతను ప్రభుత్వానికి వివరించేందుకు, మీ హక్కుల కోసం న్యాయ సహాయం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అన్నారు. అనంతరం ధర్నా చేస్తున్న చోట అపరిశుభ్రత నెలకొని మహిళా ఉద్యోగులకు ఇబ్బందిగా ఉండడాన్ని గమనించి మున్సిపల్ కమిషనర్ కు ఫోన్ చేసి వెంటనే పరిసరాలను శుభ్రం చేయాలని, మహిళలకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, చంద్రశేఖర్ నాయక్, గంధం పరంజ్యోతి, నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, సునీల్ వాల్మీకి, మంద రాము, సయ్యద్ జమీల్, కుమార్, ముద్సర్, అలీం తదితరులు ఉన్నారు.



## జాతీయస్థాయి ఇన్‌స్పైర్ అవార్డులో ప్రతిభ కనబర్చిన నివేదిత విద్యార్థి

కొత్తకోట, అక్టోబర్ 17 (మనం న్యూస్): జాతీయస్థాయి ఇన్స్పైర్ అవార్డుకు వనపర్తి జిల్లా నుంచి ఎంపికైన కొత్తకోట పట్టణానికి చెందిన నివేదిత హై స్కూల్ విద్యార్థి జి. మణికంఠ ఢిల్లీలో ఈ నెల 12 నుంచి 14 తేదీలలో జరిగిన జాతీయ ఇన్స్పైర్ అవార్డులో పాల్గొని అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రాంతం నుంచి 52 ప్రదర్శనల్లో జాతీయస్థాయికి రెండు ప్రదర్శనలు ఎంపికయ్యాయి. ఈ ప్రదర్శనలో కొత్తకోట పట్టణానికి చెందిన నివేదిత పాఠశాల విద్యార్థి జి. మణికంఠ రూపొందించిన "కంట్రోలింగ్ మొబైల్ బై యూజింగ్ టైమర్" అనే ప్రదర్శన జాతీయస్థాయిలో వనపర్తి జిల్లా ప్రతిభ పాటవాలను చాటి చెప్పిందని కలెక్టర్ ఆదర్శ సురభి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ శ్రీనివాసులు, నివేదిత విద్యాసంస్థల యాజమాన్య, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## కత్తెర, సూది మోసిన చేతులు..

# కూతురిని డాక్టర్‌ను చేశాయి!

**మెడిసిన్‌లో మెరిసిన ఉప్పునుంతల విద్యార్థిని 'జంపుల విద్య'**

**నీట్‌లో 85% పర్సంటైల్‌తో 394 మార్కులు కైవసం**

**సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు**

**అచ్చంపేటలో పాఠశాల విద్య.. హైదరాబాద్‌లో ఇంటర్ పూర్తి**



నిరుపేద కుటుంబంలో విరిసిన ఆనందం.. వెల్లువెత్తుతున్న ప్రశంసలు

ఉప్పునుంతల అక్టోబర్ 17 (మనం న్యూస్) : కఠినమైన శ్రమ, పట్టుదల ఉంటే పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని నిరూపించింది నల్లమల్ల ప్రాంతానికి చెందిన ఓ సామాన్య యువతి. రోజంతా కష్టపడుతూ క్షవరం చేసే తండ్రి, దారపు పోగుల మధ్య కళ్లల్లో వత్తులు వేసుకుని కుట్టుమిషన్ నడిపే తల్లి.. ఆ ఇద్దరు శ్రమజీవుల రెక్కల కష్టాన్ని సార్థకం చేస్తూ వారి ముద్దుల కూతురు మెడిసిన్ సీటు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది.

### సాధారణ కుటుంబం.. అసాధారణ కల

నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో జంపుల గణేష్ కటింగ్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య చైతన్య ఇంట్లోనే టైలరింగ్ చేస్తూ బట్టలు కుడుతూ భర్తకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి దాకా కత్తెరతో గణేష్, సూదితో చైతన్య పడే నిరంతర శ్రమంతా తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసమే. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితుల్లోనూ పిల్లల చదువుకు పేదరికం అడ్డురాకూడదని ఆ దంపతులు ఎంతో తపించారు.



### అచ్చంపేటలో పాఠశాల విద్య.. హైదరాబాద్‌లో ఇంటర్

తల్లిదండ్రుల చెమట చుక్కల విలువను చిన్నతనం నుంచే గుర్తించిన వారి పెద్ద కుమార్తె జంపుల విద్య, చదువునే తన ఏకైక లక్ష్యంగా మార్చుకుంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యను అచ్చంపేటలో పూర్తి చేసిన విద్య, ఆ తర్వాత హైదరాబాద్ హయత్‌నగర్ (కుంట్లూర్) పరిధిలోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది.

### నీట్‌లో సత్తా.. కొడంగల్ మెడికల్ కాలేజీలో సీటు

అనంతరం జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్ష రాసిన విద్య.. 85 శాతం పర్సంటైల్ తో 394 మార్కులు సాధించి తన ప్రతిభను చాటుకుంది. ఈ ఉత్తమ ఫలితంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిష్టాత్మక కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటును దక్కించుకుంది. తాము పడిన కష్టాన్ని మర్చిపోయేలా కూతురు వైద్య విద్యలో సీటు సాధించడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

### ఇష్టపడి చదివితే అసాధ్యం కాదు.. జంపుల విద్య

ఈ సందర్భంగా విద్య మాట్లాడుతూ.. "మా నాన్న కటింగ్ షాపులో పడే శ్రమ, అమ్మ కుట్టుమిషన్ ముందు గంటల తరబడి పడే కష్టం నా కళ్లముందే కదలాడేవి. ఆ కష్టాన్ని తీర్చడమే నా ఏకైక ధ్యేయంగా పెట్టుకున్నాను. చదువును ఎప్పుడూ భారంగా భావించకూడదు, ఇష్టపడి చదవాలి. మన కోసం అహర్నిశలు శ్రమించే తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, వారికి తగిన ప్రతిఫలాన్ని అందించి వారి కళ్లల్లో ఆనందం చూడటమే ప్రతి విద్యార్థి లక్ష్యం కావాలి. భవిష్యత్తులో ఉత్తమ వైద్యురాలిగా ఎదిగి పేద ప్రజలకు సేవ చేస్తాను" అని తెలిపింది.

### వెల్లువెత్తుతున్న అభినందనలు

ఒక సాధారణ క్షురకుడు, టైలర్ దంపతుల కుమార్తె పట్టుదలతో శ్రమించి నీట్‌లో అత్యుత్తమ స్కోరుతో కొడంగల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించడం పట్ల ఉప్పునుంతల మండల ప్రజలతో పాటు అచ్చంపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, గ్రామస్తులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఎందరో నిరుపేద విద్యార్థులకు విద్య స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడుతూ, ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

## మహాలక్ష్మి అలంకరణలో వాసవి మాత

కొత్తకోట, అక్టోబర్ 17 (మనం న్యూస్) : పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్ష్మీనారాయణ, నవగ్రహ, ఆయుష్య హోమాలతో పాటు సామూహిక అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను కొత్తకోట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భీమా చంద్రకాంత్, ఆలయ నిర్వాహకులు భీమా ప్రభాకర్, శ్రీనివాసులు, శంకర్, భీమా కిశోర్, గుంత రమణ, కిరణ్, రాజు తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు.



# డిండి ప్రాజెక్టును రద్దు చేయాలి..
# పాలమూరు జిల్లాను కాపాడాలి!

**పాలమూరు ప్రయోజనాల కోసం జడ్చర్లలో ఐక్య కార్యాచరణకు పిలుపు**

**రాజకీయాలకు అతీతంగా ఒక్కటవుదాం**

**జిల్లా భవిష్యత్తు కోసం పోరాడుదాం!**

**ఈ నెల 19న అంబేద్కర్ కళాభవన్‌లో కీలక సమావేశం**

**జేఏసీ చైర్మన్ ఎన్నిక, కార్యాచరణ రూపకల్పన!**



పాలమూరు , అక్టోబర్ 17 (మనం న్యూస్) : పాలమూరు ప్రయోజనాల విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, జిల్లా భవిష్యత్తును ప్రభావితం చేసే సాగునీటి ప్రాజెక్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందనే ఆందోళనల నేపథ్యంలో జడ్చర్ల నియోజకవర్గంలో ఐక్య కార్యాచరణకు రంగం సిద్ధమవుతోంది. డిండి ప్రాజెక్టు వల్ల పాలమూరు జిల్లాకు కలిగే నష్టాలపై సమగ్రంగా చర్చించి, జిల్లా ప్రయోజనాల పరిరక్షణ కోసం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కీలక సమావేశానికి పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లా ప్రయోజనాలు, సాగునీటి హక్కులు, భవిష్యత్తు అవసరాల పరిరక్షణ వంటి అంశాలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్న తరుణంలో జడ్చర్ల నియోజకవర్గ స్థాయిలో అన్ని వర్గాలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ప్రయత్నం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, కవులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, యువత కలిసి జిల్లా ప్రయోజనాలపై తమ అభిప్రాయాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని సమావేశ నిర్వాహకులు పిలుపునిస్తున్నారు.

**డిండి ప్రాజెక్టుపై చర్చ.. పాలమూరు ప్రయోజనాలే ప్రాధాన్యం!**

డిండి ప్రాజెక్టు అంశం పాలమూరు జిల్లా ప్రజల్లో ఆందోళనకు కారణవవుతున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాకు కలిగే ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాలని జేఏసీ ఏర్పాటు ఆహ్వాన కమిటీ భావిస్తోంది. సాగునీటి హక్కులు, ప్రాజెక్టుల ద్వారా నీటి పంపిణీ, జిల్లాలోని పెండింగ్ సాగునీటి పథకాల భవిష్యత్తు వంటి అంశాలపై వాస్తవాలు, అధికారిక గణాంకాల ఆధారంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాలమూరు రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా చూడటం, జిల్లాకు కేటాయించిన నీటి హక్కులను పరిరక్షించడం, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రజల ఆందోళనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఐక్యంగా ముందుకు సాగాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. డిండి ప్రాజెక్టును రద్దు చేయాలనే డిమాండ్‌తో పాటు, పాలమూరు జిల్లా ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన తదుపరి కార్యాచరణపై కూడా సమావేశంలో చర్చించనున్నారు.

**రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటం!**

జిల్లా ప్రయోజనాల విషయంలో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజలంతా ఒక్కటవ్వాలనే సందేశంతో జడ్చర్ల నియోజకవర్గ స్థాయిలో జేఏసీ ఏర్పాటు ప్రయత్నం చేపట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, కవులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని ఆహ్వాన కమిటీ కోరుతోంది. జిల్లా ప్రయోజనాల పరిరక్షణ అనేది ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, భవిష్యత్తు తరాలకు సంబంధించిన కీలకమైన విషయమనే భావనతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే ఈ ఐక్య కార్యాచరణ లక్ష్యంగా పేర్కొంటున్నారు.

**జేఏసీ చైర్మన్ ఎన్నిక.. పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు!**

ఈ సమావేశంలో జడ్చర్ల నియోజకవర్గ జేఏసీ చైర్మన్‌ను ఎన్నుకోవడంతో పాటు పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నారు. అనంతరం భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పించే విధానాలు, జిల్లా ప్రయోజనాల పరిరక్షణ కోసం అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. జేఏసీ ఏర్పాటు కేవలం సమావేశానికే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలను గుర్తించి, వాటిపై సమన్వయంతో ముందుకు సాగేందుకు ఉపయోగపడాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే కమిటీ ఏర్పాటు అనంతరం ఎలాంటి కార్యాచరణ ప్రకటిస్తారన్నది సమావేశంలో తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

**సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానం**

జడ్చర్ల నియోజకవర్గ జేఏసీ ఏర్పాటు కోసం ఐక్య కార్యాచరణ సమావేశం 2026 అక్టోబర్ 19, సోమవారం ఉదయం 11 గంటలకు జడ్చర్లలోని అంబేద్కర్ కళాభవన్‌లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ తెలిపింది. అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, మేధావులు, కవులు, కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు, యువత, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ విలువైన సూచనలు అందించాలని కోరింది.

పాలమూరు పరిరక్షణకు ఐక్యతే బలం!

పాలమూరు జిల్లా ప్రయోజనాల పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సాగునీటి అంశాలపై సమగ్ర చర్చకు వేదిక కల్పించడం, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించడం వంటి లక్ష్యాలతో ఈ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో జడ్చర్లలో జరిగే సమావేశంపై ఆసక్తి నెలకొంది. డిండి ప్రాజెక్టుపై తమ అభ్యంతరాలను, జిల్లా ప్రయోజనాలపై తమ ఆందోళనలను ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తం చేసేందుకు ప్రజలంతా ముందుకు రావాలని ఆహ్వాన కమిటీ పిలుపునిస్తోంది. పాలమూరు జిల్లా పరిరక్షణే లక్ష్యంగా ఐక్యంగా అడుగులు వేయాలని కోరుతోంది. పాలమూరు జిల్లా పరిరక్షణే మన లక్ష్యం! ఐక్యతే మన బలం.. జడ్చర్ల జేఏసీ మన సంకల్పం!





## మహాలక్ష్మి గా అంబభవాని అమ్మవారు

కొత్తకోట, అక్టోబర్ 17 (మనం న్యూస్): పట్టణ కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ భవానీ శంకర దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం శ్రీ అంబా భవాని అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి దేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా చెన్నై నుంచి వచ్చిన కళాకారులు సరికొత్త కరెన్సీ నోట్లతో అమ్మవారిని అత్యంత ఆకర్షణీయంగా అలంకరించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ పండితులు సురేష్ శాస్త్రి, నటరాజు, శ్రీకాంత్, సదాశివయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండాల్లో రుద్రహోమం, దేవీ హోమం నిర్వహించారు. భక్తులు హోమ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను భక్తులకు అన్నదాన కార్యక్రమాలను పొగాకు రాఘవేంద్ర ప్రసాద్, ఆయన సోదరులు, భవాని మాత సేవకులు, కార్యకర్తలు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



## రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య**

**బావాయిపల్లిలో రీ-సర్వే పనులను పరిశీలన**

కొల్లాపూర్, అక్టోబర్ 18 (మనం న్యూస్): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కోడేరు మండలం బావాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. చెన్నయ్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులు, సర్వే ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలపై ఆరా తీశారు. భూముల రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. సర్వే పనుల్లో ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదు అయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రీ-సర్వే పనుల కారణంగా ప్రజలకు భూములకు సంబంధించిన వివరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ పరిశీలనలో సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ఉగ్ర రూపం..
# నీటికి పొదుపు మంత్రం!

## నీటి తేమను కాపాడు..మల్చింగ్ బాటలో ముందుకు నడువు

### కల్వకుర్తి డివిజనల్ ఉద్యానవన అధికారిణి మహేశ్వరి



ఊరుకొండ అక్టోబర్ 17 (మనం న్యూస్) : స్థానిక మండల పరిధిలోని ఊరుకొండ పేట గ్రామపంచాయతీలో కల్వకుర్తి డివిజనల్ ఉద్యానవ అధికారిణి ఆకస్మాత్తు పర్యటన చేసింది.ఈ నేపథ్యంలో ఊరుకొండ పేట గ్రామపంచాయతీలో శనివారం స్థానిక రైతు లక్ష్మీనారాయణ బంతిపూల సాగు చేస్తున్న సందర్భంలోఎల్ నినో ప్రభావం గురించి వ్యాఖ్యానిస్తూ సూచనలు తెలియ పరుస్తూ...తెలంగాణ రైతన్నలకు ఒక హెచ్చరిక,ఒక ఆత్మీయ మనవి.ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం రాష్ట్రంపై గ్రామాలపై విషపు పంజా విసురుతుంది.వానలు అకాలం,ఎండలు దంచుతున్న వేళ నీరు వృథా అయితే పంట వృథా అవుతుంది.నీటి బొట్టు నిలుపుకుంటేనే మట్టి బతుకు నిలుస్తుంది.కాబట్టి రైతు సోదరులు అప్రమత్తంగా ఉండాలి.



**నీటిని వృథా చేయవద్దు..తేమ నేలను కాపాడుకోండి!**

నీరు ఉంటేనే నేల,నేల ఉంటేనే పంట,పంట ఉంటేనే మన బతుకు.ఎల్ నినో వేళ నీరు బంగారంతో సమానం.కాలువలు తీసి వరదలు పెట్టే పాత పద్ధతి వీడాలి.చుక్క చుక్కను పొదుపు చేయాలి.ఒకటి డ్రిప్పు,రెండు మల్చింగ్.

**మల్చింగ్ విధానం..నేలకు చీర కప్పడం**

నేలకు మల్చింగ్ షీట్ కప్పడం అంటే తల్లికి చీర కప్పినట్లే.ఎండ వేడికి నేల తేమ ఆవిరి కాదు.కలుపు మొక్కలు రావు.నేల చల్లగా ఉంటుంది.వేరు వ్యవస్థ బలంగా పెరుగుతుంది.ప్లాస్టిక్ మల్చింగ్ లేదా వరి గడ్డి,ఆకులతో సహజ మల్చింగ్ చేస్తే 40% నీరు ఆదా అవుతుంది.ఖర్చు తగ్గ లాభం పెరుగు!

**డ్రిప్పు సేద్యం..చుక్కల వరం**

వరద పారించడం మాని,డ్రిప్పుతో పంటకు నీరు ఇవ్వండి.మొక్క మొదలుకే నేరుగా చుక్క చుక్క నీరు.నీరు వృథా కాదు,ఎరువు వృథా కాదు.కరెంటు ఆదా,కష్టం ఆదా.డ్రిప్పు సేద్యం అంటే చుక్కతో ముక్కుపట్టు పంటకు తృప్తి,రైతుకు సంతృప్తి!

**పూత,పిందె..దశలో ప్రత్యేక శ్రద్ధ!**

పంట జీవితంలో పూత,పిందె కాసే దశ చాలా కీలకం.ఈ దశలో నీరు తగ్గితే పూత రాలిపోతుంది,పిందె ఎండిపోతుంది.అందుకే ఈ దశలో తేమను కాపాడటం,సమతుల్య ఎరువులు ఇవ్వడం చాలా ముఖ్యం.అవసరం లేని యూరియా,డీఏపీలను తగ్గించండి.మోతాదుకు మించి ఎరువు వేస్తే నేల నిస్సారం,పంటకు అపకారం.

**సమతుల్య పోషణ యాజమాన్యం..సమయస్ఫూర్తితో సేద్యం**

నేలను పరీక్షించి,అవసరమైన ఎరువులే వేయండి.సేంద్రియ ఎరువులు,జీవన ఎరువులు వాడండి.భూమి తల్లి ఆరోగ్యం బాగుంటేనే బిడ్డలాంటి పంట బాగుంటుంది.

**పురుగులు,తెగుళ్ల పర్యవేక్షణ..కన్ను వేసి ఉంచండి!**

ఎల్ నినో వేళ తేమ తక్కువై పురుగులు ఎక్కువవుతాయి. ప్రతిరోజూ పొలంలో తిరిగి పరిశీలించండి.పసుపు,నీలం జిగురు అట్టలు పెట్టండి.వేప నూనె పిచికారీ చేయండి.తెగులు తొలి దశలోనే గుర్తిస్తే మందు తక్కువ,లాభం ఎక్కువ.

**సరైన సమయంలో కోత..మార్కెటింగ్ లో మెలకువ**

పంట పండగానే ఆలస్యం చేయకుండా కోత కోయండి.ఆలస్యం చేస్తే రాలిపోవడం,రంగు మారడం జరుగుతుంది.కోత అయ్యాక ఆరబెట్టి,శుభ్రం చేసి,గ్రేడింగ్ చేసి మార్కెట్ కు పంపండి.ఆఘమేఘాల మీద అమ్మకం వద్దు,మార్కెట్ ధర చూసి,గిట్టుబాటు ధర వచ్చేలా అమ్మండి. రైతు సోదరులారా! నీటి బొట్టును నిలుపుదాం..తేమ నేలను కాపాడుదాం. మల్చింగ్,డ్రిప్పుతో ముందుకు నడుద్దాం.తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందుదాం! జై జవాన్..జై కిసాన్!.

# రంగురంగుల పూల సింగిడి

**ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా బతుకమ్మ**

**ఆడిపాడిన అధికారులు, మహిళా ఉద్యోగులు**

**తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో పండుగ శోభ**



ఉప్పునుంతల, అక్టోబర్ 17 (మనం న్యూస్) : తెలంగాణ సాంస్కృతిక ప్రతీక, ఆడపడుచుల ఆత్మగౌరవ పండుగైన బతుకమ్మ వేడుకలు ఉప్పునుంతల మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణాల్లో అధికారులు, ఉద్యోగులు సంయుక్తంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి విభిన్న రకాల పూలతో తీరొక్క రీతిలో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. కార్యాలయాల ఆవరణలో పూల బతుకమ్మలను కొలువుదీర్చి, మహిళా ఉద్యోగులు సాంప్రదాయ దుస్తుల్లో వాటి చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడి అలరించారు. దైనందిన విధులతో నిత్యం రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాలు ఈ వేడుకలతో పండుగ శోభను సంతరించుకున్నాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ అర్ధంకి సునీత, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో వరుణ్ తేజ ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధిస్తూ, పర్యావరణ పరిరక్షణను చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని కొనియాడారు. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంతో పాటు కార్యాలయాల్లో ఇలాంటి వేడుకలు ఉద్యోగుల మధ్య పరస్పర ఐక్యతను, ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఉప తహసీల్దార్ రమేష్, మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం బాలచందర్, తహసీల్దార్, ఎంపీడీవో, ఈ-పంచాయతీ విభాగాల సిబ్బంది, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేశారు.

# భూమి హద్దులు వ్యత్యాసాలను గుర్తించడానికే సర్వే

**సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడి ఆర్.గిరిధర్**

**గోకారంలో భూ-రీ సర్వే పై రైతులకు అవగాహన**

చారకొండ,అక్టోబర్17(మనం న్యూస్) : భూమి హద్దులు,విస్తీర్ణ వ్యత్యాసాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి సర్వే చేపడతారని నాగర్కర్నూల్ జిల్లా ఎ,డి ఆర్ గిరిధర్ అన్నారు.మండలంలోని గోకారం గ్రామంలో భూ రీ సర్వే-2026 ప్రక్రియలో భాగంగా శనివారం స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో విస్తృత స్థాయి గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చారకొండ తహసీల్దార్ ఉమ,సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి),డీఐ పాల్గొన్నారు.ఈ సభలో గోకారం రెవెన్యూ శివారులోని గోకారం,చంద్రాయన్ పల్లి,ఎర్రవల్లి గ్రామాల సర్పంచ్ లు పంజుగుల పరశు రాములు,చిలికేశ్వరం శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..భూ రీ-సర్వే ద్వారా భూముల హద్దులు,విస్తీర్ణం,భూ రికార్డుల్లో దొర్లిన వ్యత్యాసాలను గుర్తించి నిబంధనల ప్రకారం శాశ్వతంగా సరిదిద్దడం జరుగుతుందని స్పష్టం చేశారు.ఏయే సర్వే నంబర్లలో ఏ రోజున సర్వే నిర్వహిస్తారో ఆ వివరాలను సంబంధిత రైతులకు ముందుగానే తెలియజేస్తామని వెల్లడించారు.తమ భూములకు సర్వే నిర్వహించే సమయంలో రైతులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో స్వయంగా హాజరై,తమ భూమి హద్దులను ప్రత్యక్షంగా చూపిస్తూ సర్వే బృందాలకు సహకరించాలని కోరారు.అదేవిధంగా రైతులు తమ వద్ద ఉన్న పట్టాదారు పాస్‌బుక్‌లు,ఇతర భూ సంబంధిత దస్తావేజులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సమస్యలను సమగ్రంగా పరిష్కరించి పారదర్శకమైన,పక్కా రికార్డులను రూపొందించడమే ఈ రీ-సర్వే ముఖ్య ఉద్దేశమని పేర్కొంటూ,ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి రైతులు,ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్,ఆర్ ఐ సుజాత,జిపిఓ ఆంజనేయులు,వివిధ గ్రామాల రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

**ఉద్యోగ అవకాశాలకు బాట**

**మహబూబ్‌నగర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ**

**అక్టోబర్ 26 నుంచి శిక్షణ తరగతులు.. భోజనం, వసతి ఉచితం**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 17, మనం ప్రతినిధి : జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ గ్రామీణ కౌశల్య యోజన సహకారంతో మూడు నెలలపాటు ఉచిత వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ తెలిపారు. అక్టోబర్ 26 నుంచి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, మల్టీ స్కిల్ టెక్నీషియన్, ప్లంబింగ్ అండ్ శానిటేషన్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి పదో తరగతి, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ విద్యార్హత ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పించడంతోపాటు యూనిఫాం, హెల్మెట్, షూస్, సాక్స్, బ్యాగ్, పుస్తకాలు, ఇతర అధ్యయన సామగ్రిని అందజేస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వ ధ్రువీకరణ పత్రంతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆరు పాస్‌పోర్టు సైజు ఫొటోల జిరాక్స్ ప్రతులతో బోయపల్లి, సోమేశ్వర కాలనీ, నవాబ్‌పేట రోడ్డులోని ఎన్ఏసీ వైటీసీ కేంద్రాన్ని సంప్రదించాలని అదనపు కలెక్టర్ సూచించారు. మరిన్ని వివరాలకు 9440683583, 6304684819 నంబర్లను సంప్రదించవచ్చని, సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ద్వారా కూడా సమాచారం పొందవచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఉపాధి సాధన దిశగా ముందడుగు వేయాలని ఆమె కోరారు.

# జనాభా గణన రెండో దశకు పకడ్బందీ శిక్షణ

**క్షేత్రస్థాయి నిర్వహణపై అధికారులకు అవగాహన**

**రెండు రోజుల శిక్షణ పూర్తి**



మహబూబ్‌నగర్, అక్టోబర్ 17, మనం ప్రతినిధి : జిల్లాలో చేపట్టనున్న జనాభా గణన రెండో దశను సమర్థవంతంగా, లోపాలు లేకుండా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. అక్టోబర్ 16, 17 తేదీల్లో మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ శిక్షణ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి ఖుష్బూ గుప్తా సమక్షంలో ప్రారంభమైన కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వచ్చిన డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ భారతి హోలీకేరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండో రోజు శిక్షణలో భాగంగా జనాభా గణన ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, సాంకేతిక అంశాలు, అధికారుల బాధ్యతలపై శిక్షకులు వివరించారు. ప్రాక్టికల్ సెషన్ల ద్వారా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు. అధికారుల సందేహాలను నివృత్తి చేస్తూ విధుల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



జనాభా గణనలో సమాచార సేకరణ, సాంకేతిక ప్రక్రియల అమలు కీలకమైన నేపథ్యంలో ఈ శిక్షణ ప్రాధాన్యత సంతరించుకుంది. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ గణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది. కార్యక్రమంలో జిల్లా సెన్సస్ అధికారి బి. నర్సింలు, అదనపు సెన్సస్ అధికారి పి. శ్రీనివాస్, మాజీ గణాంక శాఖ డైరెక్టర్, కన్సల్టెంట్ దయానందం, శిక్షకులు శివరామకృష్ణతో పాటు ఛార్జ్ అధికారులు, ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించాలి

**సాధారణ ప్రసవాలను పెంచాలి**

**భూత్పూర్ పీహెచ్‌సీలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 17, మనం ప్రతినిధి : భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రీనివాసులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఫార్మసీ, ల్యాబొరేటరీ, వార్డులను పరిశీలించడంతోపాటు సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. వైద్య సేవల నిర్వహణ, సిబ్బంది పనితీరు, ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధులకు నిర్ణీత సమయానికి హాజరై సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి లోపల, బయట పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు సమర్థంగా అందుతున్నాయా అనే అంశంపై ఆకస్మిక తనిఖీలు కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అబ్దుల్ రబ్, డాక్టర్ శివకాంత్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# తీరొక్క పూల జాతర

**ప్రకృతి పరవశం..పల్లె పదాల సమ్మేళనం**

**నవజాత శిశువుల వైద్య నిపుణుడు,డా,నాగార్జున**



ఊరుకొండ అక్టోబర్ 17 (మనం న్యూస్) : స్థానిక మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి. శనివారం బీఎస్పీ రాష్ట్ర నాయకుడు డా,నాగార్జున సద్దుల బతుకమ్మ ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ,సద్దుల బతుకమ్మ జరుపుకుంటున్న ఆడపడుచులందరికీ బహుజన బతుకమ్మ శుభాకాంక్షలు అంటూ,సద్దుల బతుకమ్మ వైభవం! తెలంగాణ నేల తల్లి పులకించే పండగ,ఆడబిడ్డల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ.ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన ఈ పూల పండగ,తొమ్మిది రోజుల పాటు ప్రకృతిని,పురుషుడిని, స్త్రీ శక్తినీ ఒక్కటి చేస్తూ సాగి,చివరకు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది.ఇది కేవలం పూలను పేర్చే పండగ కాదు,బతుకును అలంకరించుకునే అద్భుత సంస్కృతి.ప్రకృతి పూజ పరమార్థం. గునుగు, తంగేడు, చామంతి, మల్లె, కనకాంబరాల తీరొక్క పూలను సేకరించి,గోపురంలా పేర్చడంలోనే ఒక గొప్ప జీవన తత్త్వం దాగి ఉంది.సృష్టిలోని ప్రతి పువ్వును దైవంగా భావించి పూజించే ఏకైక సంస్కృతి మనది.కరువు కాటకాలను తరిమికొట్టి,చెరువులన్నీ జలకళలాడాలని,ప్రకృతి సమతుల్యత కాపాడబడాలని కోరుకునే లోతైన పర్యావరణ స్పృహ ఈ పండగలో కనిపిస్తుంది.యాసప్రాసల అలజడి,పల్లె పదాల సందడి. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ సాగే జానపద గేయాలలో పల్లె యాస ఉట్టిపడుతుంది.ఆటాపాటల్లోని ప్రాసలు,లయబద్ధమైన చప్పట్లు విశ్వమంతటికీ ఒకే తరంగాన్ని పంపుతాయి."చిత్తూ చిత్తూల బొమ్మ శివుడి ముద్దుల బొమ్మ" అంటూ సాగే పాటల్లో ఆధ్యాత్మికతతో పాటు మానవ సంబంధాల అనుబంధాలు పెనవేసుకుపోయి ఉంటాయి.అత్తగారింటి ఆంక్షలు,పుట్టింటి పలకరింపులు,ఆడబిడ్డల ఆవేదనలు,ఆనందాలు అన్నీ ఈ పాటల్లో సాహిత్యమై ప్రవహిస్తాయి.

## సద్దుల నైవేద్యం..సకల జనుల సౌభాగ్యం

తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మనాడు సమర్పించే ఐదు రకాల సద్దులు (పెరుగన్నం,చింతపండు పులిహోర,నిమ్మకాయ అన్నం,నువ్వుల అన్నం,కొబ్బర అన్నశీ కేవలం నైవేద్యాలు కావు,ఆరోగ్య ప్రదాతలు.వర్షాకాలం ముగిసి శీతాకాలం మొదలయ్యే ఈ సంధి కాలంలో శరీరానికి అవసరమైన రోగనిరోధక శక్తిని ఈ సద్దులు అందిస్తాయి.పల్లెల్లో అందరూ ఒకచోట చేరి ఈ సద్దులను పంచుకుని తినడంలో సామరస్యం,సమ,సమాజ స్థాపన అనే లోతైన అర్థం గోచరిస్తుంది.సద్దుల బతుకమ్మ కేవలం ఒక ప్రాంతీయ పండగ కాదు,అది విశ్వవ్యాప్తమైన మాతృశక్తి ఆరాధన.చెరువు గట్టున బతుకమ్మలను సాగనంపుతున్నప్పుడు ఆడబిడ్డల కళ్లలో మెరిసే నీటి సుడులు,"పోయిరావమ్మ బతుకమ్మ.మళ్లీ ఏడాదికి రావమ్మ" అనే ప్రార్థనలు మన సంస్కృతి అమరత్వానికి నిదర్శనాలు.ఈ వైభవాన్ని గుండెల్లో దాచుకుని,రాబోయే తరాలకు అందించడం మనందరి బాధ్యత పునరుద్ఘాటించారు.జై బహుజన హితాయ,జై బహుజన సుఖాయ,జై బహుజన బతుకమ్మ అంటూ నినదించారు.



# చారకొండలో నవరాత్రి ఉత్సవాలు

చారకొండ,అక్టోబర్17(మనం న్యూస్) : చారకొండ మండలంలోని గ్రామాలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు.శనివారం చారకొండ మండల కేంద్రంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్టించి దుర్గమాత అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు.మండపం వద్ద మహిళలు కోలాటాలు,బతుకమ్మ తదితర సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.అమ్మవారు మాలధారణ భక్తులు తొమ్మిది రోజుల పాటు నియమ నిబంధనలతో,నిచిష్టలతో కఠోరమైన దీక్షలు చేస్తున్నారు.అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో అమ్మవారు మాలధారణ భక్తులు,స్వామి వివేకనంద యువజన భక్త బృందం,యువకులు, మహిళలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు రిజిస్ట్రేషన్లలో అక్రమాల కలకలం!




**భవనాలున్నా ఖాళీ స్థలాలుగానే విలువ కట్టారా?**

**ఎనుగొండ సంతోష్ నగర్ గిఫ్ట్ డీడ్లపై అనుమానాలు..**

**ప్రభుత్వ ఖజానాకు రూ.10 లక్షల గండి పడిందనే ఆరోపణలు!**

**రిటైర్డ్ ఉద్యోగి హఫీజ్ పాత్రపై చర్చ..**

**సబ్ రిజిస్ట్రార్ ప్రకాష్ బాధ్యతలపై ప్రశ్నలు**

**ఆడిటింగ్ జరిగినా అక్రమాలు గుర్తించలేదా?**

**జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్!**

పాలమూరు, అక్టోబర్ 17 (మనం న్యూస్ : ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన రిజిస్ట్రేషన్ శాఖలోనే అక్రమాలకు తావుందా? ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కాపాడాల్సిన అధికారుల పర్యవేక్షణలో లోపాలున్నాయా? భవనాలు ఉన్న ఆస్తులను ఖాళీ స్థలాలుగా పరిగణించి రిజిస్ట్రేషన్లు చేశారన్న ఆరోపణల వెనుక అసలు కథేమిటి? మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎనుగొండ సంతోష్ నగర్‌కు సంబంధించిన రెండు గిఫ్ట్ డీడ్ల వ్యవహారం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. మెట్రో మహబూబ్‌నగర్--మెదక్ ఈవెనింగ్స్ అక్టోబర్ 16 సంచికలో ప్రచురితమైన కథనం ప్రకారం, డాక్యుమెంట్ నంబర్లు 11909/2026, 11908/2026కు సంబంధించి ఆస్తుల విలువ నిర్ధారణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ప్రశ్నలు తలెత్తాయి. భవనాలు ఉన్నప్పటికీ వాటిని ఖాళీ స్థలాలుగా పరిగణించి విలువ కట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా ప్రభుత్వానికి సుమారు రూ.10 లక్షల ఆదాయం నష్టం వాటిల్లి ఉండవచ్చన్న ప్రచారం సాగుతోంది. అయితే, వాస్తవంగా భవనాలు ఉన్నాయా? రిజిస్ట్రేషన్ సమయంలో వాటి వివరాలు ఏ విధంగా నమోదు చేశారు? వర్తించే నిబంధనల ప్రకారం ఎంత విలువ నిర్ధారించాలి? ఎంత స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేశారు? ప్రభుత్వానికి నిజంగా ఎంత ఆదాయ నష్టం వాటిల్లింది? అనే అంశాలు అధికారిక రికార్డుల పరిశీలనతోనే తేలాల్సి ఉంది.

**భవనాలు ఉన్నా ఖాళీ స్థలాలుగా చూపించారా?**

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆస్తి స్వభావం, విస్తీర్ణం, నిర్మాణాల వివరాలు, వర్తించే మార్కెట్ విలువ వంటి అంశాలు కీలకమైనవి. ఆస్తిపై భవనాలు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన వివరాలు, వర్తించే విలువను నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఎనుగొండ సంతోష్ నగర్‌కు సంబంధించిన రెండు డాక్యుమెంట్లలో ఆస్తుల వాస్తవ పరిస్థితికి, రిజిస్ట్రేషన్ సమయంలో నమోదైన వివరాలకు మధ్య వ్యత్యాసం ఉందా? ఉంటే ఆ వ్యత్యాసానికి కారణమేమిటి? తక్కువ విలువతో రిజిస్ట్రేషన్ జరిగి ఉంటే దానికి ఎవరు బాధ్యత వహించాలి? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇది కేవలం రెండు డాక్యుమెంట్లకు సంబంధించిన వ్యవహారమేనా? లేక ఇలాంటి ఇతర రిజిస్ట్రేషన్లలోనూ విలువ నిర్ధారణను పరిశీలించాల్సిన అవసరం ఉందా? అన్న కోణంలోనూ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**రిటైర్డ్ ఉద్యోగి హఫీజ్ పాత్రపై విచారణ జరగాలి!**

రిజిస్ట్రేషన్ శాఖలో గతంలో పనిచేసి పదవీ విరమణ చేసిన హఫీజ్ పాత్రపై కూడా ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత కార్యాలయ వ్యవహారాల్లో ఆయన జోక్యం చేసుకుంటున్నారన్న ప్రచారం నేపథ్యంలో, అసలు ఆయనకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ ప్రక్రియతో ఏమైనా సంబంధం ఉందా? ఉంటే దాని స్వరూపం ఏమిటి? అనే అంశాలను అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. డాక్యుమెంట్ల తయారీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వరకు ఎవరు ఎలాంటి పాత్ర పోషించారు? సంబంధిత పత్రాలను ఎవరు సిద్ధం చేశారు? ఆస్తుల విలువను ఎవరు నిర్ధారించారు? రిజిస్ట్రేషన్ సమయంలో ఏయే అధికారులు పరిశీలించారు? అనే అంశాలపై ఆధారాలతో కూడిన విచారణ జరగాలి. రిటైర్డ్ ఉద్యోగి పేరు వినిపిస్తోందన్న కారణంతోనే ఆయనపై ఆరోపణలను నిజమని నిర్ధారించలేం. అదే సమయంలో, ఆరోపణల్లో వాస్తవం ఉందా లేదా అన్నది తేల్చకుండా వదిలేయడం కూడా సరికాదు. అందుకే సంబంధిత రికార్డులు, పత్రాలు, వాంగ్మూలాల ఆధారంగా నిష్పక్షపాత విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**రూ.6 లక్షల వ్యవహారంపై ఆరోపణలు.. ఆధారాలతో తేల్చాలి!**

ఈ వ్యవహారానికి సంబంధించి సబ్ రిజిస్ట్రార్ స్థాయి అధికారికి రూ.6 లక్షలు చెల్లించారనే ఆరోపణలు కూడా ప్రచారంలో ఉన్నట్లు కథనంలో పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ అందుబాటులో లేదు. డబ్బుల లావాదేవీలు జరిగాయా? జరిగితే ఎవరి మధ్య, ఏ ప్రయోజనం కోసం జరిగాయి? బ్యాంకు లావాదేవీలు, ఇతర ఆర్థిక ఆధారాలు లేదా సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు ఉన్నాయా? అన్న అంశాలను విచారణ అధికారులు పరిశీలించాలి. ఆధారాలు లేకుండా ఎవరినీ దోషిగా ప్రకటించడం సమంజసం కాదు. అదే సమయంలో, తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయడం కూడా బాధ్యతాయుతమైన వైఖరి కాదు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అవాస్తవమైతే ప్రజల్లో నెలకొన్న అనుమానాలను తొలగించేలా వివరణ ఇవ్వాలి.

**ఆడిటింగ్ జరిగినా లోపాలు గుర్తించలేదా?**

రిజిస్ట్రేషన్ శాఖలో రికార్డుల తనిఖీ, ఆడిటింగ్ ప్రక్రియలు ఎందుకు నిర్వహిస్తారు? ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే లోపాలు ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దడానికే కదా! ఈ నేపథ్యంలో సంబంధిత డాక్యుమెంట్లను ఆడిటింగ్ సమయంలో పరిశీలించారా? పరిశీలిస్తే భవనాల వివరాలు, ఆస్తుల విలువ, వసూలైన రుసుముల మధ్య ఏమైనా వ్యత్యాసాలను గుర్తించారా? గుర్తించినట్లయితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? గుర్తించకపోతే ఎందుకు గుర్తించలేకపోయారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. ఆడిటింగ్ బాధ్యతలతో సంబంధం ఉన్న ప్రకాష్ పాత్ర, బాధ్యతల పరిధి ఏమిటన్నది రికార్డుల ఆధారంగా పరిశీలించాలి. ఆయనపై ఆరోపణలు ఉన్నాయనే కారణంతోనే తప్పు చేసినట్లు భావించకుండా, సంబంధిత విధులు, పరిశీలన నివేదికలు, అధికారిక పత్రాల ఆధారంగా బాధ్యతలను నిర్ధారించాలి.

**జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి!**

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా కింది అంశాలపై స్పష్టత తీసుకురావాల్సిన అవసరం ఉంది. - డాక్యుమెంట్ నంబర్లు 11909/2026, 11908/2026కు సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించాలి. - రిజిస్ట్రేషన్ సమయంలో ఆస్తుల వాస్తవ పరిస్థితి ఏమిటో క్షేత్రస్థాయిలో నిర్ధారించాలి. - భవనాలు ఉన్నాయా? ఉంటే వాటి వివరాలు డాక్యుమెంట్లలో ఎలా నమోదు చేశారో పరిశీలించాలి. - వర్తించే నిబంధనల ప్రకారం ఆస్తుల విలువను తిరిగి లెక్కించాలి. - వసూలైన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు వివరాలను పరిశీలించి, ప్రభుత్వానికి ఏమైనా ఆదాయ నష్టం జరిగిందో తేల్చాలి. - సంబంధిత ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్లు, ఇతర వ్యక్తుల పాత్రపై ఆధారాలతో విచారణ జరపాలి. - ఆడిటింగ్ నివేదికలు, తనిఖీ రికార్డులను పరిశీలించి బాధ్యతలను నిర్ధారించాలి. - అక్రమాలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, నిబంధనల ప్రకారం రావాల్సిన ప్రభుత్వ ఆదాయాన్ని రాబట్టాలి.

**పారదర్శకత ఎక్కడ? బాధ్యత ఎవరిది?**

రిజిస్ట్రేషన్ శాఖ ప్రజల ఆస్తులకు సంబంధించిన కీలకమైన విభాగం. ఇక్కడ జరిగే ప్రతి లావాదేవీకి చట్టబద్ధత, పారదర్శకత, ఖచ్చితమైన విలువ నిర్ధారణ అత్యంత ముఖ్యం. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించేలా ఎవరైనా వ్యవహరించినట్లు తేలితే, వారి హోదా ఏదైనా సరే చట్టం ముందు బాధ్యత వహించాల్సిందే. ఎనుగొండ సంతోష్ నగర్‌కు సంబంధించిన ఈ రెండు డాక్యుమెంట్ల వ్యవహారంలో నిజానిజాలు వెలుగులోకి రావాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల వివరణలను కూడా తీసుకోవాలి. రికార్డుల పరిశీలనతో వాస్తవాలను నిర్ధారించి, ప్రజలకు అధికారికంగా వివరించాలి. ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగిందా లేదా? జరిగితే ఎంత? ఆ నష్టానికి ఎవరు బాధ్యులు? రిజిస్ట్రేషన్ ప్రక్రియలో లోపాలు ఉంటే వాటిని ఎవరు గుర్తించాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికినప్పుడే ఈ వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు తెరపడుతుంది. ప్రజాధనం ఒక్క రూపాయి కూడా అన్యాయంగా నష్టపోకూడదు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికీ తమ వాదన వినిపించే అవకాశం కల్పిస్తూ, ఆధారాల ఆధారంగా నిష్పక్షపాత విచారణ జరగాలి. ఇదే ప్రజల ప్రధాన డిమాండ్!

# కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**రంగురంగుల పూలతో పండుగ శోభ..**

**సంప్రదాయ ఆటపాటలతో సందడి**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 17, మనం ప్రతినిధి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజు కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో



జరుపుకున్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు కలెక్టరేట్ ఆవరణకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా ఉద్యోగినులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సంబరాల్లో పాల్గొనడంతో ప్రాంగణమంతా పండుగ కళను సంతరించుకుంది. మహిళా ఉద్యోగినులతో పాటు పురుష ఉద్యోగులు సైతం వేడుకల్లో పాల్గొని ఉత్సాహాన్ని పంచుకున్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ ఆటపాటలతో సందడి చేశారు. పూలను పూజిస్తూ ప్రకృతితో మమేకమయ్యే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటారు. కార్యాలయ విధులతో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులు ఇలాంటి



సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సంప్రదాయాలను గుర్తుచేసుకోవడంతో పాటు పరస్పర స్నేహభావాన్ని పెంపొందించుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఓ), మెప్మా, జిల్లా పౌర సంబంధాల శాఖ, ఉప కార్యనిర్వాహక సమాచార ఇంజినీర్ కార్యాలయాలకు చెందిన మహిళా ఉద్యోగినులు తమ శాఖల తరపున రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, డీఆర్‌డీఓ నర్సింహులు, జిల్లా పౌర సంబంధాల అధికారి పి. శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్ ఇస్రా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటితో భవన నిర్మాణాలా?

# జడ్చర్లలో అధికారుల నిర్లక్ష్యమెంత?

**ప్రజలకు తాగునీటి కష్టాలు..**

**నిర్మాణాలకు మాత్రం నల్లా నీళ్లు!**

**అనుమతులిచ్చే అధికారులకు నీటి వృథా కనిపించడం లేదా?**

**నిబంధనలు అమలు చేయాలని పట్టణ ప్రజల డిమాండ్!**





పాలమూరు, అక్టోబర్ 17 (మనం న్యూస్) : ప్రజలకు తాగడానికి నీళ్లు దొరకడం కష్టమవుతున్న పరిస్థితుల్లో.. భవన నిర్మాణాలకు మాత్రం తాగునీటిని యథేచ్ఛగా వినియోగించడం ఎంతవరకు సమంజసం? మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణ పనులకు నల్లా కనెక్షన్ల ద్వారా సరఫరా అవుతున్న నీటిని ఉపయోగిస్తున్నారనే అంశంపై పట్టణ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు నిర్మాణ పనులకు తాగునీటిని వినియోగిస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇళ్లలో కుటుంబ అవసరాలకు సరిపడా నీళ్లు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, భవన నిర్మాణాల కోసం నల్లా నీటిని వినియోగిస్తే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణ పనులకు అవసరమైన నీటిని ప్రత్యామ్నాయ మార్గాల్లో సమకూర్చుకునే అవకాశం ఉన్నప్పటికీ, తాగునీటినే వినియోగించడం వల్ల ప్రజలకు అందాల్సిన నీటి సరఫరాపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అనుమతులకే పరిమితమా? పర్యవేక్షణ బాధ్యత లేదా?**

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్న అధికారులు, నిర్మాణ పనుల్లో నీటి వినియోగంపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. అనుమతులు ఇవ్వడం మాత్రమే అధికారుల బాధ్యత కాదని, నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయా? ప్రజలకు సరఫరా చేసే తాగునీరు దుర్వినియోగం అవుతోందా? అనే అంశాలను కూడా పరిశీలించాలని కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిర్మాణ పనులకు తాగునీటిని వినియోగిస్తున్నారనే ఫిర్యాదులపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ప్రతి నిర్మాణంలోనూ నల్లా నీటినే ఉపయోగిస్తున్నారనే నిర్ధారణకు రావాలంటే అధికారులు వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సి ఉంది.

**హైదరాబాద్‌లో కఠిన నిబంధనలు.. జడ్చర్లలో అమలు ఎక్కడ?**

నీటి వృథాను అరికట్టేందుకు హైదరాబాద్‌లోని మున్సిపల్ సంస్థలు పలు ఆంక్షలు, జరిమానాలపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో, జడ్చర్లలోనూ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలనే డిమాండ్ వినిపిస్తోంది. తాగునీటిని వాహనాల శుభ్రతకు, నిర్మాణ పనులకు, ఇతర అవసరాలకు అనవసరంగా వినియోగించకుండా నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పట్టణవాసులు అభిప్రాయపడుతున్నారు. అయితే, హైదరాబాద్‌లో అమలవుతున్న నిర్దిష్ట జరిమానా నిబంధనలు జడ్చర్లకు కూడా వర్తిస్తాయా? అనే విషయాన్ని సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

**నీటి కొరత ప్రజలకేనా? నిర్మాణదారులకు నిబంధనలు వర్తించవా?**

తాగునీరు అనేది ప్రజల ప్రాథమిక అవసరం. ఇంట్లో చిన్నారులు, వృద్ధులు ఉన్న కుటుంబాలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, అదే నీటిని నిర్మాణ పనులకు వినియోగించడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది. నీటి వినియోగంలో బాధ్యత, పొదుపు ప్రతి ఒక్కరికీ అవసరమని ప్రజలు చెబుతున్నారు. నిర్మాణదారులకు ఒక నిబంధన, సాధారణ ప్రజలకు మరో నిబంధన అన్న భావన కలగకుండా అధికారులు వ్యవహరించాలని కోరుతున్నారు. నల్లా నీటిని నిర్మాణ పనులకు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని పరిశీలించి, నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**మున్సిపల్ కమిషనర్ స్పందించాలి!**

జడ్చర్ల పట్టణంలో తాగునీటి వినియోగంపై స్పష్టమైన విధానం రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందని ప్రజలు అంటున్నారు. భవన నిర్మాణాలకు తాగునీటి వినియోగంపై ఏవైనా పరిమితులు ఉన్నాయా? ఉంటే వాటిని ఎలా అమలు చేస్తున్నారు? ఉల్లంఘనలకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలపై మున్సిపల్ అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజల తాగునీటి అవసరాల కంటే నిర్మాణ పనులకే ప్రాధాన్యం పెరిగితే ఎలా? అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. తాగునీటి వృథాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడంతో పాటు, నిర్మాణదారులకు ప్రత్యామ్నాయ నీటి వనరుల వినియోగంపై అవగాహన కల్పించాలని పట్టణవాసులు సూచిస్తున్నారు. ఇప్పటికైనా జడ్చర్ల మున్సిపల్ అధికారులు స్పందిస్తారా? తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడతారా? లేక ప్రజల ఫిర్యాదులు కాగితాలకే పరిమితమవుతాయా? అనేది వేచి చూడాలి.

## బాల్యవివాహాలను ఆదిలోనే అరికడదాం

**తాసీల్దార్ యూసుఫ్ అలీ**



ఊరుకొండ అక్టోబర్ 17 (మనం న్యూస్): స్థానిక మండల పరిధిలో శనివారం బాల్య వివాహాలను అరికట్టాలని "మనం పేపర్ తో ప్రత్యేక కథనం"ఊరుకొండ తహసిల్దార్ యూసుఫ్ అలీ ఈ నేపథ్యంలో వ్యాఖ్యానిస్తూ కల్మషం లేని చిరునవ్వులు,కంటినిండా ఆశలు,ఆటపాటల అలజడులు.ఇదే పసిడి బాల్యం.సృష్టిలోనే అత్యంత మధురమైన, పవిత్రమైన ఘట్టం బాల్యదశ.కానీ,నేటికీ సమాజంలో కొన్ని మూలల్లో ఈ పసిడి బాల్యంపై పగబట్టినట్లు,పసిమొగ్గలను చిదిమేసే 'బాల్యవివాహం' అనే దురాచారం కోరలు చాస్తూనే ఉంది.ఆడపిల్లను లక్ష్మీదేవిగా ఆరాధించే సమాజంలో,అదే పిల్లకు అక్షరాల ఆయుధాన్ని ఇవ్వాల్సింది పోయి,అగ్నిసాక్షిగా అగచాట్ల పాలు చేయడం అత్యంత శోచనీయం.బాల్యం అంటే చదువుల ఊయల కావాలి గానీ,బాధ్యతల మోత కాకూడదు.ఆటల తోట కావాలి గానీ,కన్నీటి కాట కాకూడదు.బాల్యవివాహం అనేది కేవలం ఒక చట్టవిరుద్ధమైన చర్య మాత్రమే కాదు,అది ఒక పసి ప్రాణంపై జరిగే సామాజిక నేరం.శారీరకంగా,మానసికంగా ఎదగాల్సిన వయసులో,మెడలో మూడు ముళ్ళు వేసి,మురిపాల మువ్వలను మూగబోయేలా చేయడం న్యాయమా? పుస్తకాల సంచి మోయాల్సిన చేతులతో,సంసార సాగరాన్ని ఈదమనడం ఎంతవరకు సమంజసం?ఆదిలోనే అరికట్టాలి. ఈ దుస్థితి మారాలి.పసిడి బాల్యానికి రక్షణ కవచంలా నిలవాల్సిన బాధ్యత కేవలం తల్లిదండ్రులదే కాదు,సమాజంలోని ప్రతి ఒక్కరిది. సమాజంలో చైతన్య దీపాలు వెలిగించాలి.విద్యావంతులు,స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలి. పసిమొగ్గలను వికసించనిద్దాం.వారి కలలకు రెక్కలు తొడుగుదాం. రండి,మనమంతా కలిసి ప్రతిజ్ఞ చేద్దాం.బాల్యవివాహాలను ఆదిలోనే అరికడదాం,పసిడి బాల్యాన్ని కాపాడుకుందాం అంటూ ముగించారు.

## జడ్చర్లలో డెంగ్యూ లక్షణాలు.. అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ

**డెంగ్యూ నివారణకు వైద్య ఆరోగ్యశాఖ చర్యలు**

**101 ఇళ్లలో పైరెత్రం స్ప్రే.. బాలుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన డీఎంహెచ్ఓ**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 17, మనం ప్రతినిధి : జడ్చర్ల బాదేపల్లిలోని గౌరీ శంకర్ కాలనీలో డెంగ్యూ లక్షణాలతో బాధపడుతున్న బాలుడి ఇంటిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ. శ్రీనివాసులు శనివారం వైద్య సిబ్బందితో కలిసి సందర్శించారు. బాలుడి కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య సిబ్బంది కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించడంతో పాటు దోమల నివారణ చర్యల్లో భాగంగా మొత్తం 101 ఇళ్లలో పైరెత్రం స్ప్రే చేశారు. అంతకుముందు జిల్లా జనరల్ ఆసుపత్రిలోని పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న జడ్చర్లకు చెందిన 11 ఏళ్ల బాలుడిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. శ్రీనివాసులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర పరిశీలించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి, కోలుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు (డీఎల్ఓ), జిల్లా మాస్ మీడియా అధికారి నరసింహారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ హనుమంతు, అశోక్ రాజు, సుభాష్ చంద్ర తదితర వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# స్థానిక సమర శంఖం పూరిస్తాం

**వికసిస్తున్న కమలం..ప్రగతికి సోపానం**

**క్షేత్రస్థాయిలో పార్టీ..బలోపేతం**

**భాజాపా రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**

**కమ్మదనం.. కమల నాథుల కలయిక**

**తెలంగాణ రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షుడు చెరుకు మణికంఠ**



ఊరుకొండ అక్టోబర్ 17( మనం న్యూస్) : స్థానిక మండల పరిధిలోని బొమ్మరాజు పల్లి గ్రామపంచాయతీ శనివారం స్థానిక సర్పంచి చెరుకు తిరుపతమ్మ శివయ్య వార్డు సభ్యులు రాష్ట్ర భాజపా నాయకుడు ముచ్చర్ల జనార్ద న్ రెడ్డి రథసారథ్యంలో మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి సంభాషిస్తూ.. రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల రణరంగంలో భారతీయ జనతా పార్టీ సమర శంఖాన్ని పూరించినుంది. కునారిల్లుతున్న గ్రామ సీమల్లో ప్రగతి వెలుగులు నింపేందుకు,అవినీతి కోటలను బద్దలు కొట్టేందుకు కమల దళం కదనరంగంలోకి దూకింది. పల్లె పల్లెనా కాషాయ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా శ్రేణులను కార్యోన్ముఖులను చేసింది. సమరం సంచలనం"ఇది కేవలం ఎన్నికల సమయం కాదు,ప్రజా సంక్షేమ వ్యతిరేక శక్తులపై సాగించే అక్షరాలా ప్రగతి సమరం. జన హృదయాలలో జన రంజక పాలన కోసం సృష్టించబోయే నూతన సంచలనం." అధికార మదంతో విర్రవీగే పాలకుల పంతాలను పటాపంచలు చేస్తాం. అస్తవ్యస్తంగా మారిన స్థానిక వ్యవస్థలను సరిదిద్ది,పల్లెల అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తాం."తెలంగాణ నేలపై అడుగడుగునా కమలం వికసించబోతోంది. ఆ వికసిస్తున్న కమలం సగటు పౌరుడి జీవితంలో తెరిచేది సరికొత్త సుఖశాంతుల ద్వారం. ఈ కమల వికాసమే రేపటి ప్రగతి ప్రకాశం. "ఢిల్లీ నిధులు నేరుగా గల్లీకి చేరాలన్నా, ప్రతి పేదవాడి ఇంటా సంక్షేమ భాగ్యం వర్ధిల్లాలన్నా, భాజాపా తోనే సాధ్యం. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన పాలకుల తీరును నిరసిస్తూ,"కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయతీలను, మున్సిపాలిటీలను స్వయం సమృద్ధంగా తీర్చిదిద్దడమే మా ప్రథమ కర్తవ్యం. సాగునీరు, తాగునీరు, రహదారుల నిర్మాణం,యువతకు ఉపాధి కల్పన వంటి రంగాలలో నూతన ఒరవడిని సృష్టిస్తాం. ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలికి,సమగ్ర వికాసమే శ్వాసగా ముందుకు సాగుతాం."స్థానిక సమర శంఖం పూరిస్తాం. సవాల్‌ను స్వీకరించాం. ప్రతి కార్యకర్త ఒక సైనికుడై,ప్రతి ఇల్లు ఒక వేదికై కమల ముద్రను సగర్వంగా చాటాలి. రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో కాషాయ జెండా రెపరెపలాడటం ఖాయం," అని రాష్ట్ర నాయకత్వం ధీమా వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంఘం అధ్యక్షుడు చెరుకు మణికంఠ వ్యాఖ్యానిస్తూ.. కమలం అంటే పువ్వు కాదు,అది ఒక తత్వం బురదలో పుట్టి బురద అంటకుండా,బ్రతికేతత్వం నీటిపై నిలిచి,నీటిని తాకని యోగ తత్వం. అలాంటి కమలనాథుడు విష్ణువు,కమలంలో నివసించే నాధురాలు లక్ష్మీదేవి,కమలనాధులు అంటే లక్ష్మీనారాయణులు వారి కలయిక అంటే శుభానికి శుభం. లాభానికి లాభం. ఒక కమలం పూస్తే కొలను శోభిస్తుంది. రెండు కమలాలు కలిస్తే ఊరే శోభిస్తుంది. ఈ కలయికతో పనులు పరుగులు పెడుతాయి. మాటలు మంత్రాలవుతాయి. అడుగులు అభివృద్ధి వైపు పడతాయి. ఇది మాటల కలయిక కాదు,చేతల కలయిక,ఇది హంగుల హడావిడి కాదు,హృదయాల కలయిక అంటూ ప్రశంసించారు. ఆ కమల వనంలో విహరించే కమలనాధులకు ఈ కలయిక హృదయపూర్వక అభినందనలు. మీ కలయిక కమ్మదనం కలకాలం నిలవాలి. మీ స్నేహ సౌరభం ఊరంతా పరిమళించాలని,మీ ఐక్యతతో ప్రాంతం అభివృద్ధి పథంలో పయనించాలని నినదించారు. గ్రామ యువకులు, పెద్దలు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

**బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు, మహిళా ఉద్యోగులు**

**అంబరాన్నింటిన బతుకమ్మ సంబరాలు**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల భాగస్వామ్యంతో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ ఆడిపాడారు. దీంతో కలెక్టరేట్ ప్రాంగణమంతా బతుకమ్మ పండుగ శోభను సంతరించుకుంది. మహిళల ఆటపాటలతో సందడిగా మారిన వాతావరణం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య ఈ పండుగను జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకతని తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెబుతుందని తెలిపారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే పండుగలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు సామాజిక, ఆర్థిక రంగాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా సంఘాల భాగస్వామ్యంతో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు మహిళల్లో ఉత్సాహాన్ని నింపాయి. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ పూల పండుగ విశిష్టతను మరోసారి చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ పాండు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, అదనపు పిడి రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







# ఎస్ఐఆర్ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అసలు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి : కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్ఐఆర్,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు, తదితర అంశాలపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.... ఎస్ఐఆర్ లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 లకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న విచారణలను త్వరితగతిన పూర్తి చేసి, అవసరమైన వారికి నోటీసులు జారీ చేసి,తదుపరి చర్యలను సకాలంలో చేపట్టాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు. ఓటర్ల అర్హతలను నిర్ధారించే సమయంలో సంబంధిత పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి, అర్హులైన వారికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూడాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు, అనర్హమైన నమోదు లేదా డూప్లికేట్ వివరాలు లేకుండా సంబంధిత అధికారులు బాధ్యతతో వ్యవహ రించాలని స్పష్టం చేశారు. ప్రతి బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని దరఖాస్తులు, ఓటర్ల వివరాలకు సంబంధించిన రికార్డులను భౌతిక పత్రాల రూపంలో సక్రమంగా నిర్వహించి, భవిష్యత్తు అవసరాల కోసం భద్రపరచాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సీఈఓ సూచించారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ దరఖాస్తులను ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో క్షుణ్ణంగా పరిశీలించి, నకిలీ, తప్పుడు, డూప్లికేట్ దరఖాస్తులు లేకుండా అర్హతలను నిర్ధారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.

# నేటి పొదుపే రేపటి ఆర్థిక భరోసా

**ప్రతి కుటుంబం పొదుపును అలవాటుగా మార్చుకొని ఆర్థికంగా స్థిరపడాలి**

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**టీజీబీ ప్రత్యేక డిపాజిట్ పథకాల కరపత్రాన్ని విడుదల**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో) : ప్రజలు తమ ఆదాయంలో కొంత భాగాన్ని పొదుపు చేయడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు ఆర్థిక భరోసా పొందవచ్చని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. శనివారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు తెలంగాణ గ్రామీణ బ్యాంకు అందిస్తున్న ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాల వివరాలతో రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....ప్రతి కుటుంబం పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. బ్యాంకులు అందిస్తున్న డిపాజిట్ పథకాలపై అవగాహన కలిగి ఉండి, తమ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సరైన పథకాన్ని ఎంచుకోవాలని తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకు రూ.1 లక్ష డిపాజిట్‌పై 1,000 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంలో సాధారణ ఖాతాదారులకు 7.50 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.00 శాతం వార్షిక వడ్డీ రేట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా, 444 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంలో సాధారణ ఖాతాదారులకు 7.40 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం వార్షిక వడ్డీ రేట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఈ ప్రత్యేక డిపాజిట్ పథకాలపై మరింత సమాచారం అందించేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు కొత్త బస్టాండ్ సమీపంలో, రిజిస్ట్రేషన్ ఆఫీస్ రోడ్డులో,ఎస్‌వీ టిఫిన్ సెంటర్ పక్కన అందుబాటులో ఉందని తెలిపారు. ఆసక్తి గల ఖాతాదారులు మరిన్ని వివరాల కోసం 9247543618 నంబర్‌ను సంప్రదించి పథకాల వివరాలను తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. డిపాజిట్ చేసే ముందు బ్యాంకు అధికారులను సంప్రదించి తాజా వడ్డీ రేట్లు, నిబంధనలను నిర్ధారించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా బ్యాంకింగ్ సేవలు, డిపాజిట్ పథకాలపై అవగాహన కల్పించేలా బ్యాంకు అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వైభవ్,అసిస్టెంట్ మేనేజర్ గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలో పారామెడికల్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో) : 2026--27 విద్యా సంవత్సరానికి గాను గద్వాల్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రిలో రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (30 సీట్లు), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ (30 సీట్లు) కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బై.పి.సి ఉత్తీర్ణులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. వారు అందుబాటులో లేని పక్షంలో ఎం.పి.సి ఆ తర్వాత ఇతర గ్రూపుల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం అవకాశం కల్పిస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు https://www.tgpmb.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.100 నగదును ఈ నెల 24వ. తేదీ సాయంత్రం 4 గంటలలోపు గద్వాల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సమర్పించాలి. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్సైట్ https://www.gmcjogulambagadwal.org/ లేదా పారామెడికల్ బోర్డు వెబ్సైట్ https://www.tgpmb.telangana.gov.inలను మరియు 8008188253 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



## హెచ్ 82 అచ్చంపేట డివిజన్ నూతన కమిటీ ఎన్నిక



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో) : తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 52 నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో నూతనంగా ఏర్పడిన అచ్చంపేట డివిజన్ కమిటీని శనివారం ఎన్నుకోవడం జరిగింది. కార్మికుల హక్కుల పరిరక్షణ ఉద్యోగుల సంక్షేమం సమస్యల పరిష్కారం కోసం నిరంతరం యూనియన్ బలోపేతమే ధ్యేయంగా నూతన కమిటీ పనిచేస్తుందన్నారు.

**నూతన కమిటీలో ఎన్నికైన వారు**

అధ్యక్షుడు పొలాది పరశురాం, ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ షకీల్ పాషా, ఉపాధ్యక్షులు మైబు, విద్యాసాగర్, కోశాధికారి హరికాంత్, జైంట్ సెక్రటరీలు దయాకర్, యాదగిరి, ప్రకాష్, అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి విజయలక్ష్మి, సోషల్ మీడియా కార్యదర్శి పులి జంగయ్యలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ.... విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యుల మందరం ఐక్యంగా కృషిచేసి సమస్యల పరిష్కారం కోసం ముందుంటామన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం మా కమిటీ నిరంతరం పోరాడుతుందన్నారు. యూనియన్ గా ఉండి అభివృద్ధికి అంకితభావంతో పాటుపడతామన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగిని కలుపుకొని ఐక్యతతో ముందుకు సాగుతూ కార్మిక సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు యూనియన్ నాయకులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ ఏకతాటిగా పనిచేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఉద్యోగులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్న బీసీ చైతన్య పాదయాత్రకు

# అడుగడుగునా జననీరాజనం

**అడుగడుగునా ప్రజలు బ్రమ్మరతం, విజయవంతంగా 30 రోజులు పూర్తి**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 17 (మనం బ్యూరో) : బీసీలలో ఓ పక్క చైతన్యం నింపుతూ, బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజ్యాధికార సాధనే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ చైతన్య పాదయాత్ర విజయవంతంగా శనివారం నాటికి 30 రోజులు పూర్తి చేసుకుంది. పెద్దకొత్తపల్లి నుంచి కొల్లాపూర్ వరకు సాగిన పాదయాత్రకు వివిధ గ్రామాల ప్రజలు, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పలుకుతూ పెద్దఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా ప్రజల నుంచి లభించిన అపూర్వ స్పందన పాదయాత్రకు మరింత ఉత్సాహాన్ని నింపింది.

**అడుగడుగునా జననీరాజనం**

పాదయాత్ర సాగిన మార్గంలో ప్రజలు తీన్మార్ మల్లన్నకు స్వాగతం పలుకుతూ తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ముఖ్యంగా బీసీ వర్గాలకు చెందిన ప్రజలు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు పాదయాత్రలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. నాయకుడితో కలిసి అడుగులో అడుగు వేస్తూ, పాదయాత్రలో మమేకమవుతూ ముందుకు సాగారు. ప్రజల ఉత్సాహం, కార్యకర్తల కదలికలు, బీసీ సంఘాల భాగస్వామ్యంతో పాదయాత్ర మార్గం సందడిగా మారింది.

**బీసీల హక్కుల సాధనే లక్ష్యంగా చైతన్య యాత్ర**

సమాజంలో బీసీలకు సముచిత గుర్తింపు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, అభివృద్ధిలో సమాన అవకాశాల ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇటువంటి చైతన్య కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి. బీసీ వర్గాల సమస్యలను ప్రజా చర్చలోకి తీసుకురావడం, హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశాన్ని ప్రజల్లో విస్తరించడం పాదయాత్ర ప్రధాన ఉద్దేశంగా నిలుస్తోంది. ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్తూ 30 రోజులుగా సాగుతున్న ఈ పాదయాత్రకు వివిధ ప్రాంతాల్లో లభిస్తున్న ప్రజా స్పందన బీసీ చైతన్య ఉద్యమానికి ప్రాధాన్యం పెరుగుతున్నదనే సంకేతాన్ని ఇస్తోంది. పెద్దకొత్తపల్లి నుంచి కొల్లాపూర్ వరకు సాగిన శనివారం నాటి పాదయాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును చాటారు. నాయకులు, కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజలు సైతం పాదయాత్రలో భాగస్వాములు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐక్యతతోనే హక్కుల సాధన బీసీ వర్గాల ఐక్యత, రాజకీయ చైతన్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పాదయాత్రలు వేదికగా నిలుస్తున్నాయి. ప్రజల నుంచి లభిస్తున్న స్పందనతో ఉత్సాహంగా సాగిన తీన్మార్ మల్లన్న బీసీ చైతన్య పాదయాత్ర శనివారం నాటికి 30 రోజుల మైలురాయిని చేరుకుంది. పెద్దకొత్తపల్లి నుంచి కొల్లాపూర్ వరకు సాగిన యాత్ర విజయవంతంగా ముగియడంతో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజల్లో ఉత్సాహం మరింత రెట్టింపుగా కనిపించింది.



# మహాలక్ష్మి అలంకారంలో దుర్గాదేవి

## నంది హిల్స్ పార్కులో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

వనపర్తి, అక్టోబర్ 18 (మనం ప్రతినిధి) : మహాలక్ష్మి మాత పాహిమాం అంటూ భక్తుల జయజయధ్వానాల నడుమ నంది హిల్స్ పార్కులో కొలువుదీరిన దుర్గామాత శనివారం మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో అలంకరించి వైభవంగా పూజలు నిర్వహించారు. పార్కులో నూతనంగా నిర్మించిన ప్రత్యేక మండపంలో కొలువుదీరిన అమ్మవారికి వేద పండితులు శాస్త్రోక్తంగా మంత్ర పుష్పాలతో విశిష్ట పూజలు, మహా మంగళహారతి సమర్పించారు. నవరాత్రుల్లో దశమహావిద్యల పూజల్లో మహాలక్ష్మి ఆరాధనకు విశేష ప్రాధాన్యం ఉందని, ఐశ్వర్య ప్రదాయిని, సర్వ సంపత్ దాయిని అయిన మహాలక్ష్మిని ఆరాధిస్తే అష్టలక్ష్ముల కటాక్షం, ధనధాన్య వృద్ధి, సౌభాగ్య సిద్ధి



కలుగుతుందని పండితులు తెలిపారు. మహాలక్ష్మి అష్టోత్తరం, కనకధారా స్తోత్ర పారాయణం, లలితా సహస్రనామ పఠనంతో మండపం మార్మోగింది. ఈ సందర్భంగా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు, సహస్ర నామార్చన, నవావరణ అర్చనలు చేశారు. అనంతరం అమ్మవారికి అలంకరించిన చీరలను వేలం వేయగా మహిళలు పోటీపడి భక్తితో దక్కించుకున్నారు. అమ్మవారిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, నరసింహ, కాలనీవాసులు వెంకటరమణ, ఎల్లా గౌడ్, ప్రతాప్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నారాయణరెడ్డి, స్కాలర్స్ కళాశాల డైరెక్టర్ జగదీశ్వర్, కొండ గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఎన్. బుచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# రోగుల ఆరోగ్యమే- మా ధ్యేయం!

## పచ్చని చెట్లతో ఆక్సిజన్ విడుదల.. ఒక్క వ్యక్తి ఒక్క బిందె నీళ్లు పొయ్యాలి

### ఔషధం మొక్కలు నాటిన ఆర్ఎంఓ

ఉమ్మడి గోపాలపేటఅక్టోబర్: 17( మనంన్యూస్) : మా ఆసుపత్రికి వచ్చిన ప్రతిరోగి ఆరోగ్యంగా ఉండాలన్నదే మా ధ్యేయమని (ఎం సి హెచ్) ఆర్ ఎం ఓ డాక్టర్. బంగారయ్య అన్నారు. వనపర్తి జిల్లా నర్సింగాయపల్లి గ్రామ శివారులో ఉన్న (ఎం సి హెచ్) మాతా శిశు ఆరోగ్య కేంద్రం లో శనివారం ఆర్ ఎం ఓ బంగారయ్య తోపాటు సోషల్ వెల్ఫేర్ నాయకులు ఆసుపత్రి సిబ్బంది రోగులకు ప్రజలకు మంచి ఆక్సిజన్ పొందడానికి ఔషధ మొక్కలు( వేప చెట్లు ) మొక్కలను నాటి ప్రజల అభినందనలు పొందారు. ముఖ్యంగా ఆసుపత్రిలో ప్రసవించిన బాలుడి పేరుపై గుర్తుండేలా ఆ బాలుడి తల్లిదండ్రులు చెట్లు అదే విధంగా పోషణ కోసం ఫినిషింగ్ ఏర్పాట్లు చేయించారు. వారి జ్ఞాపకార్థంగా కుమారుడు పుట్టినరోజు సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాత శిశు ఆసుపత్రిలో ఈనెల 9 తారీకు సాయంత్రం నాలుగు గంటల 10 నిమిషాలకు గిద్ద మహేశ్వరి విజయ్ కుమార్ స్వేరో స్వేరోలకు కొడుకు పుట్టిన సందర్భంగా ఆసుపత్రికి ఔషధం వంటి వేప చెట్టును కొడుకు పేరు ఆసుపత్రి ఆర్ఎం బంగారయ్య సమక్షంలో వేప చెట్టును నాటి గట్టిదిట్టమైన భద్రతతో చెట్టుకు వలయం కూడా చేయించి సందర్భం కార్యక్రమాన్ని ఉద్దేశించి కిరణ్ కుమార్ స్వేరో తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మాట్లాడుతూ చెట్టే మనిషికి మూలాధారం చెట్టే మనిషికి జీవాధారం చెట్లు లేనిదే బ్రతికే లేదని చెప్తూ జీవన జాతికి వెతికే లేదని మాట్లాడుతూ ఆసుపత్రికి గొప్ప బహుమానాన్ని ప్రధానము చేశారు కొడుకు గిద్ద విజయ్ సింహ స్వేరో పేరున గిద్ద మహేశ్వరి విజయ్ కుమార్ స్వేరో పంచభూతాల్లో ప్రధానమైన గాలినిచ్చే చెట్టును నాటినందున అనేక రకాలుగా వ్యాధులతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులందరూ ఈ వేపచెట్టు ఔషధముగా భావిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరు బిందెడు నీళ్లు పోయాలని మాట్లాడిన సందర్భములోనిది. కార్యక్రమంలో డాక్టర్లు నర్సులు. గంధం నాగార్జున గోర్ల భాస్కర్ అరుణ్ కుమార్ స్వేరో మదిలేటి స్వేరో. రామచంద్రయ్య. కురుమయ్య. సూపర్వైజర్ వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు..



# పల్లె దవఖాన తాళం కూడా తీయని సిబ్బంది

త్రిపురారం అక్టోబర్ 17 మనం న్యూస్ : త్రిపురారం మండలం మాటూరు గ్రామం పల్లె దావఖన వైద్య సిబ్బంది విధుల నిర్వహణ తీరు ఇష్టరాజ్యంగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.అక్కడ పనిచేసే వైద్య సిబ్బంది సమన్వాయ పాలన పాటించకపోవడంతో పాటు వైద్య సేవలు సక్రమంగా అందించాలని విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం నిబంధనల ప్రకారం పల్లె దావఖన ప్రతిరోజు ఉదయం 9:00 నుండి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందించడంతోపాటు సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉంది. కానీ మాటూరు



పల్లె దావఖన మాత్రం సమన్వాయ పాలన పాటించడం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.వైద్య సిబ్బంది కోసం రోగులు గంటల తరబడి ఎదురు చూసి పరిస్థితి ఉంది ఇప్పటికైనా మండల వైద్య ఆరోగ్యశాఖ అధికారి స్పందించి మాటూరు పల్లె వైద్య కేంద్రం పనితీరుపై విచారణ జరిపించాల్సి ఉంది.

## పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

### చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి

త్రిపురారం అక్టోబర్ 17 మనం న్యూస్ : త్రిపురారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు మొత్తం రూ₹.51,05,916 విలువైన కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను స్థానిక శాసనసభ్యులు శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేసి,వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గాజుల ప్రమీల, ఆర్ఐ సంతోషి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆలంపల్లి జానయ్య,బుచ్చిరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,రవి, చంద్రారెడ్డి, వెంకట్ రెడ్డి, భాస్కర్,సతీష్,రంగారెడ్డి,వీరయ్య,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు,వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు కావాలి

త్రిపురారం అక్టోబర్ 17 మనం న్యూస్ : త్రిపురారం మండలం సత్యం పహాడ్ తండా గ్రామపంచాయతీలో ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు శ్రీ ఇస్లావత్ రాంచందర్ నాయక్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు.

# అన్నారంలో కనకదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

## భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన, సరస్వతీ పూజ

తుంగతుర్తి :అక్టోబర్ 17,( మనం న్యూస్) : తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు కుంకుమార్చన, సరస్వతీ పూజ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకం గా అలంకరించి, వేదమంత్రోచ్చారణలు, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేసి, కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్ధనలు చేశారు. అనంతరం విద్యకు ఆధిదేవత అయిన శ్రీ సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్యార్థులు, యువతీ యువకులు, గ్రామ ప్రజలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం మొత్తం భక్తి గీతాలు, మంగళ వాయిద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

# కలెక్టరేట్‌కు భూ నిర్వాసితుల పాదయాత్ర!

**పరిహారంచెల్లించకుంటే పనులు సాగవు**

**రైతులతో కలిసి జిల్లా, రాష్ట్రమంతా ఉద్యమాలు చేపడతాం**

**చట్టం ప్రకారం పరిహారంచెల్లించాలి..**

**జిల్లా కలెక్టర్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు సమర్పణ**

**సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం. డి జబ్బార్**




గోపాలపేట అక్టోబర్17:( మనం న్యూస్ ) బుద్ధారం రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రభుత్వం సరైన న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భూ నిర్వాసితులు పాదయాత్ర చేపట్టారు. నిర్వాసితులకు మద్దతుగా సిపిఎం సిపిఐ రాష్ట్ర జిల్లా నాయకులు పాదయాత్రలో పాల్గొని వారికి మద్దతు పలికారు. జిల్లా కలెక్టర్ కు భూములు కోల్పోయిన నిర్వాసితుల పక్షాన ఉంటూ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభికి అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ సిపిఎం నాయకులు మాట్లాడారు. బుద్ధారం పెద్ద చెరువు భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం మార్కెట్ రేటు కు మూడింతలు పరిహారం చెల్లించకుంటే కట్ట నిర్మాణ పనులు సాగబోవని సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం డి జబ్బార్ లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుద్ధారం పెద్ద చెరువు భూనిర్వాసితుల పోరాట కమిటీ, సిపిఎం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో శనివారం బుద్ధారం రచకట్ట నుంచి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం వరకు భూ నిర్వాసితులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు, మహిళా విద్యార్థి సంఘాల నాయకులు, భూములు కోల్పోతున్న రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్ధారం, గోపాల్పేట, వనపర్తి, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పుట్ట ఆంజనేయులు, ఎండి జబ్బార్ ప్రసంగించారు. బుద్ధారం పెద్ద చెరువు రిజర్వాయర్ నిర్మాణం వల్ల రెండవ దశల్లో ముంపునకు గురవుతున్నాయన్నారు. 135 మంది రైతులకు సంబందించి 101 ఎకరాల 33 గుంటలు భూములు ముంపునకు గురవుతున్నాయన్నారు. భూములు ముంపునకు గురయ్యే రైతులకు ఎకరాకు 15,00000/- రూపాయలు (అక్షరాల పదిహేను లక్షల రూపాయలు) ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. కానీ ఆ భూములు రెండు, మూడు పంటలు పండుతున్నాయన్నారు. ఇందులో సర్వే నెం:228లో 2026 జూలై 19వ తేదీన మార్కెట్ విలువ, ప్రభుత్వం సవరించిన విలువ ప్రకారం ఏ.ధర్మారావుకు 4 ఎకరాల 20 గుంటలు ఉంటే ఇందులో 2 ఎకరాల 11 గుంటల భూమి కొత్తగా ముంపునకు గురవుతున్నదన్నారు. ఎకరా భూమి 15,75,000/-రూపాయలు మార్కెట్ రేటు ఉన్నదన్నారు. కావున మూడు రెట్లు అనగా 47,25,000/- రూపాయలు అవుతుందన్నారు. కావున చట్ట ప్రకారం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ భూములలో ప్రతి ఎకరాకు బోర్లు, పైపులైన్లు, పండ్ల తోటలు, మామిడి, కొబ్బరి, టేకు, నేరడి తదితర ఉద్యానవనాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ఈ భూములలో ఆరు పెద్ద బావులు, విద్యుత్ సౌకర్యం ట్రాన్స్ఫార్మర్లు ఉన్నాయన్నారు. ఇదే పెద్ద చెరువు రిజర్వాయర్లో మొదటి దశ ముంపునకు గురైన భూములు దాదాపు 200 మంది రైతుల భూములు 110 ఎకరాల భూమి ముంపుకు గురయిందన్నారు. దీనికి ఎకరాకు 12,40,000/- రూపాయలు ఇచ్చారన్నారు. వీరికి బావులు, బోర్లు ఉండి ఉద్యాన పంటలు ఉన్న నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. కావున వారికి కూడా కొత్త లెక్క ప్రకారమే నష్టపరిహారం పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. 2013 సంవత్సరం భూ సేకరణ చట్ట ప్రకారం 47,25,000/- రూపాయలు ప్రతి ఎకరాకు ఇవ్వాలని వారు కోరారు. బోర్లు, బావులు, పైపులైన్లు, పండ్ల తోటలు, మామిడి, కొబ్బరి, టేకు, నేరడి చెట్లకు కరెంటు ట్రాన్స్ఫార్మర్లకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. 47,25,000/- రూపాయలు ఇవ్వని ఎడల భూమికి భూమి ఇవ్వాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన భూమి కోల్పోతున్న యువకులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఆ భూమిపై ఆధారపడి వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్న కూలీలకు వెయ్యి రోజులకు పని దినాలకు కూలి చెల్లించాలన్నారు. భూమి కోల్పోతున్న ఎస్సీ, ఎస్టీలకు రిజర్వాయర్ కింద రెండు ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. భూమి కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. అలాగే 176, 177, 178, 24 సర్వే నెంబర్లలో రికార్డులో ఉన్న వారికి కాకుండా అనుభవదారులకు రికార్డును మార్పు చేసి అనుభవదారులకే నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం బాధిత రైతు కుటుంబాలకు నష్టపరిహారాన్ని చెల్లించకుంటే ప్రస్తుతం బుద్ధారానికే పరిమితమైన రైతుల ఉద్యమాన్ని జిల్లా రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి ఫస్ట్ నష్టపరిహారాన్ని పొందేలా ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. పాదయాత్ర అనంతరం జిల్లా కలెక్టర్ కార్యలయం ముందు ధర్నా చేసి అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మరియు భూసేకరణ జిల్లా అధికారి తిరుపతయ్య గారికి ఏడు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ పాదయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, సిఐటియు జిల్లా కార్యదర్శి మండ్ల రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నిక్సన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు వెంకట రాములు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం బాల్య నాయక్, రైతు సంఘం నాయకులు దేవేందర్, సిఐటియు నాయకులు ఏ కృష్ణయ్య, సిపిఎం నాయకులు మౌలాలి మద్దిలేటి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, విద్యార్థి సంఘం నాయకులు మౌలాలి, మహేష్, భూ నిర్వాసితుల పోరాట సంఘం నాయకులు, గ్రామ సర్పంచ్ పలుస శేఖర్ గౌడ్, గ్రామ ఉపసర్పంచి పి శివాజీ, మాజీ సర్పంచ్ జామ్లా నాయక్, వార్డ్ మెంబర్ వెంకటేష్, రైతులు కే కృష్ణ, ఏ శేఖర్ సాంబయ్య సింహయ్య ధర్మారావు దాదాపు 100 మంది రైతులు పాల్గొన్నారు.



## నడిగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

**బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బోనగిరి ఉపేందర్**




కోదాడ//నడిగూడెం, అక్టోబర్ 17(మనం న్యూస్): ఎల్ నినో ప్రభావంతో సరైన వర్షాలు కురవక, విద్యుత్ సమస్యలు, సాగునీటి కొరతతో పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు అల్లాడిపోతున్నారని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బోనగిరి ఉపేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. నడిగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నడిగూడెం మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తే, నేడు పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందని, వ్యవసాయ కూలీలకు ఉపాధి లేక కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినప్పటికీ, ప్రభుత్వం తగిన ముందస్తు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. పంటలు ఎండిపోతున్నాయి.. రైతులు కన్నీరు పెడుతున్నారు.. అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం లేదా? అని ప్రశ్నించారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకొని సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమైంది. కళ్లముందే నీళ్లు వృథాగా పోతుంటే.. మన రైతులు మాత్రం సాగునీటి కోసం అల్లాడాల్సిన దుస్థితి ఎందుకు? అని నిలదీశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతోపాటు వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది.. రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా రైతుల సమస్యలపై దృష్టి సారించి, నడిగూడెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బోనగిరి ఉపేందర్ కోరారు.